


మెయిల్ తన రాకని వెయ్యిగొంతులతో చాటుకుంటూ వచ్చి స్టేషన్‌లో ఆగింది. ఫ్లాట్‌ఫారమంతా ఒక్కసారిగా చైతన్యవంతమైంది. పళ్లబళ్లవాళ్లు, చాయ్, తినుబండారాలమ్మేవాళ్ల కేకలతో కోలాహలంగా వుంది. రైలు ఎక్కేవాళ్ల ఆదుర్దా, దిగేవాళ్ల మందలింపులు, పోర్టర్ల పరుగులు. జనం ప్రవాహంలా గేటువైపు కదిలిపోతున్నారు తొక్కిసలాడుకుంటూ, మరో పదినిమిషాలకి కాస్త హడావుడి సర్దుకుంది. బంధుమిత్రులకి వీడ్కోలివ్వటానికి వచ్చిన జనం తలుపులదగ్గర కిటికీలదగ్గర నిలబడి మాట్లాడుతున్నారు. మరో ఐదునిముషాల్లో మెయిల్ స్టేషన్ విడిచిపెట్టబోతోందన్న హెచ్చరిక మైక్‌లో వినవచ్చింది.

గేటులోంచి బయటికిపోయే జనం మధ్యగా నిలబడిన సాధుబాబా రెండడుగులు వేసి హఠాత్తుగా నిలబడిపోయాడు. ఒంటికంటిని చికిలించి ముందుకి వంగి పరీక్షగా చూశాడు. వెనక వస్తున్న జనం కదలకుండా అడ్డుగానిలబడిన సాధుబాబాని ఓసారి కోపంగా పరికించి చూసి, ఆ మొహాన్ని మరోసారి చూడలేమన్నట్టుగా మొహాలు తిప్పుకుని వెళ్ళిపోతున్నారు. పెరిగిన గడ్డం, జడలుకట్టిన జుట్టు, మెరిసే గాజు కన్ను, బుగ్గమీది వికృతమయిన గాయం మచ్చ - చిన్నపిల్లలు చూసి ఝడుసుకునేట్టుగా వున్న రూపం.

ముందుకి వంగి చూస్తున్న సాధుబాబా ఆసరాలేకపోతే పడిపోతానేమోనన్నట్లుగా చేతి నిచాపి ఇనపతలుపు గట్టిగా పట్టుకున్నాడు. శరీరం చిన్నగా వణుకుతోంది. ఎలా సంభవం! ఇదెలా సంభవం! భగవాన్!

జనంవెళ్ళేదోవకిపదిగజాలదూరంలో నిలబడి వెళ్ళే ప్రయాణీకుల్ని పరీక్షగా చూస్తున్న దామె. సన్నగా ఐక్కచిక్కిన శరీరం,పాలిపోయిన మొహం, ఆ కళ్ళలో పరిశీలన. జనం అంతా దాటిపోగానే ఆమె దృష్టి ఆఖరున నిలబడిపోయిన సాధుబాబామీద ఒక్క క్షణం నిలిచి, నిరాశలో వాలిపోయింది. అతిమెల్లగా అడుగులు వేస్తూ మూడవతరగతి ప్రయాణీకుల హాల్లోని ఓమూలకి నడిచిందామె. ఓ మూలగా వాల్చివున్న కుక్కిమంచంలో చేరబడి అలసటగా కళ్ళు మూసుకుంది.

తలుపు నానుకుని నిలబడిన సాధుబాబా చేత్తో గట్టిగా ఇనపకమ్మీని పట్టుకుని మతిపోయినవాడిలా అలాగే నిలబడిపోయాడు. ఆ వికృతమయిన మొహంలో ఆనందమో, ఆశ్చర్యమో, విచారమో చెప్పలేని భావాలు శరవేగంగా కదిలిపోతున్నాయి. ఉక్కిరిబిక్కిరవుతున్న మనిషిలా నిలబడిపోయాడు. మెయిలుబండి గావుకేకపెడుతూ స్టేషను విడిచిపెట్టింది.

మరో రెండు రైలుబండ్లు వచ్చివెళ్ళినాయి. అతనిలో చలనం లేదు. ఆమె ప్రతిబండినుంచి దిగివెళ్ళే జనాన్ని పరిశీలనగాచూస్తూ నిరాశగా, నిస్పృహగా వెళ్ళి ఆ మంచంలో చేరబడి కళ్ళుమూసుకుంది. మరి కాసేపటికి ఓ ముసలి పోర్టరు చేతిలోని ఓ ఆకులో రెండు రొట్టెలు పట్టుకుని దగ్గరగా వచ్చి ఆమెచేతిలో వుంచాడు. ఆమె భావరహితమయిన చూపుతో అతనివైపొకసారి చూసి మెల్లగా ఆ రెండు రొట్టెలు తినసాగింది.

సాధుబాబా కలలోంచి మేల్కొన్నట్లుగా, హఠాత్తుగా ప్రాణంవచ్చినట్లుగా చకచక అడుగులేసి వెనుదిరిగిపోతున్న పోర్టర్ని సమీపించి 'తాతా' అని పిల్చాడు మెల్లగా.

పోర్టరు ఆగిపోయి, వెనుదిరిగి ఆశ్చర్యంగా సాధుబాబాని చూశాడు.

"తాతా!"

"ఏమయ్యా?" అన్నాడు తాత.

"ఆవిడ ఎవరు? అదే నువ్విప్పుడు భోజనంపెట్టావే? ఆమె!" అన్నాడు.

"ఏం? ఎందుకు? ఏంకావాలి?" అన్నాడు ముసలి పోర్టరు అనుమానంగా సాధుబాబా వికృతరూపాన్ని చూస్తూ.

ఏంచెప్పాలో తెలియనట్టుగా సాధుబాబా రెండు క్షణాలు మౌనంగా వుండిపోయాడు. "ఏంలేదు. ఎక్కడో నాకు తెలిసిన మనిషిలాగ వుందేను," అన్నాడు మెల్లగా.

ముసలితాత కళ్లు, ఆశగా, సంతోషంగా ఒక్కసారి మెరిసినాయి. "నిజంగా ఆ అమ్మ నీకు తెలుసా?" అన్నాడు ఆతృతగా.

"ఆవిడ సంగతి నువు చెబితే, నాకు తెలిసిన మనిషి అవునో కాదో చెప్పగలను," అన్నాడు మెల్లగా సాధుబాబా.

తాత దీర్ఘంగా ఓసారి నిట్టూర్చాడు. "ఏం చెప్ప మన్నావు? ఓ పిచ్చిమనిషి," అన్నాడు విచారంగా.

"దాదాపు పద్దెనిమిది సంవత్సరాలవుతుందేమో! ఓ రోజు మెయిలుబండి దిగొచ్చింది. జనమంతా వెళ్ళిపోయినా ఈ అమ్మ బంగారవు బొమ్మలా అక్కడ గేటుదగ్గరే నిలబడి పోయింది, ఓ చిన్నపెట్టె చేతపుచ్చుకుని. పొద్దు తిరిగి పోతున్నా అక్కడే నిలబడిపోయింది మంత్రంపెట్టినట్టుగా. పనిలేని వెధవలంతా చుట్టూ జేరి తలో పొల్లుమాట అనటం కూడా ఆ అమ్మ వినిపించుకున్నట్టులేదు. వచ్చేపోయే బళ్ల లోంచి దిగేజనాన్ని పరీక్షగా, ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టుగా చూసేది. నే నా రాత్రివరకు ఆ అమ్మని గమనిస్తూనేవున్నాను. ఆడకూతురు, పెద్దింటి పిల్లలాగుంది. వయస్సులోవున్న పిల్ల అన్చెప్పి "ఏ వూరమ్మా!" అంటూ కదిపాను. కళ్లనిండా నీరు నింపుకుని నావయిపు చూసింది. ఒక్కమాటకి జవాబు చెప్పలేదు. నే నప్పుడే గ్రహించాను. ఏ వెధవో మాయమాటలు చెప్పి, ఆ పిల్లని మోసగించి పరారయ్యుంటాడని. రెండు రోజులయినా అదే పద్ధతి. జనమంతా ఆ పిల్లవైపు వింతగా, విచిత్రంగా చూసేవారు. ఆ పిల్ల ఎవరినీ పట్టించుకున్నట్టే కనబడేదిగాదు. ఎంతసేపూ బండిలోంచి దిగబోయే ఎవరికోసమో ఎదురుచూస్తు న్నట్టుగా వుండేది. ఆ పిల్లకి మనుస్సు చెదిరిందేమోనన్న అనుమానం వచ్చింది. స్టేషనుమాస్టర్లంతా వచ్చి అడిగినారు. ఒక్కరిగ్గూడా తనెవరో, ఏ ఊరో, అక్కడేం పనో నోరు తెరచి ఒక్కమాటగూడా చెప్పలేదు. ఆ పిల్లపేరేమిటో గూడా ఎవరికీ తెలియదు. సడన్ షాక్ తగిలి మతి చెదిరివుంటుందని అంతా అనుకున్నారు. కొంతమంది పెద్దలు ఆ పిల్లని హాస్పటల్లోగానీ, ఆశ్రమంలోగానీ చేర్చాలని ప్రయత్నించారు. ససేమిరా ఈ చోటునించి కదిలిందిగాదు. అప్పటినుంచి ఆ వేయిటింగు హాల్లో ఆమూల చోటు చూసుకుంది! వచ్చే పోయే బండ్లు చూడడం. ఆ మూల పోయి కూర్చోవటం. ఆ బిడ్డని చూసినప్పుడల్లా దేవుడిదగ్గరికిపోయిన నా కూతురే జ్ఞాపకొస్తుంది. నా బిడ్డకికూడా ఇదే వయసుండేది. మారెమ్మ ఎత్తుకుపోయింది. ఆనాటినుంచీ వేళకింత రొట్టె పట్టుకెళ్లి ఇస్తాను. తిన్ననాడు తింటుంది. లేన్నాడు లేదు. ఎట్లా వుందో చూసినావుగా! మరింకెన్నాళ్లో బతుకదయ్యా! మునుపటి రూపే లేదు."

ఆ మోసంజేసిన వెధవ ఎవడోగానీ, ఆ పిల్ల వుసురు పోసుకోడంటావా సాధుబాబా? దేవుడుంటే ఆ దౌర్భాగ్యుడికి శిక్ష వెయ్యడంటావా?"

కన్నీటిని తుడుచుకుంటూ విచారంగా, క్రోధంగా, కోపంగా అడిగాడు ముసలి తాత.

ఇంతలో ఎక్స్‌ప్రెస్‌బండి గీ పెడుతూ వచ్చి ఆగింది. తాత సాధుబాబాని వదిలేసి, ఆదరాబాదరాగా బండివైపు పరుగుతీశాడు.

శిలావిగ్రహంలాగా నిలబడిన సాధుబాబా కళ్లనుంచి జారిపడే కన్నీరు గుబురు గడ్డంలో ఇంకిపోతోంది.

'భగవాన్! ఎంత వింత! ఇన్ని సంవత్సరాలుగా, ఇదే చోట ఎదురుచూస్తున్నావా నూర్! ఎంత దౌర్భాగ్యుడిని తండ్రీ! ఇంతకాలంగా... ఇదేచోట...అయ్యో- భగవాన్!'

సాధుబాబా చేతుల్లో మొహంకప్పుకుని నిలబడిన చోటే కూలబడిపోయాడు.

*　　*　　*

మరో రైలుబండి కూతపెడుతూ స్టేషన్ విడిచివెళ్ళి పోయింది. ఆమె నిరాశగా తిరిగివచ్చి మంచంలో చేరబడింది.

సాధుబాబా మెల్లగా, ఆమెవైపుగా నడిచాడు. ఆమె దృష్టి ఎదురుగావున్న దేనినీ గమనించటంలేదు. అన్నిటినీ తప్పించుకుని ఎదురుగావున్న ఏ దూరతీరాల్లోనో పరిశీలి స్తోంది. దగ్గరగా నిలబడిన సాధుబాబానికూడా ఆమె గమనించనేలేదు.

ఎదురుగా ఓ మూల ఇద్దరు కుంటివాళ్లు డబ్బు పంచు కుంటున్నారు. మరో మూలగా ఇద్దరు పల్లెటూరివాళ్ళు తలక్రింద మూటలు పెట్టుకుని నిద్రపోతున్నారు. మరోచోట సామాన్లు చేర్చుకుని బండికోసం ఎదురుచూస్తూ కబుర్లాడు తున్నారు.

సాధుబాబా ఆమె దగ్గరగా వంగి అతి మెల్లగా, మృదువుగా పిలిచాడు "నూర్'' అంటూ.

ఆమెలో చలనంలేదు. విరగబూసిన పూలచెట్టుకేసి తదేకదృష్టితో చూస్తోంది.

సాధుబాబా ఆమెకి మరింతదగ్గరగా వంగి మరోసారి పిలిచాడు. "నూర్ ఇటుచూడు."

ఉలిక్కిపడినట్లుగా ఆమె కనురెప్పలు రెపరెపలాడాయి. ఒక్క క్షణం కళ్ళెత్తి సాధుబాబా వైపు చూసి, మరుక్షణం ఆ మొహం చూడలేనట్లుగా దృష్టి తిప్పుకుని మరో వైపు చూడసాగింది.

సాధుబాబా మరోసారి మృదువుగా పిలిచాడు.

"నూర్"

వెనుకనించి బలమయిన హస్తం మెడపట్టుకుని నొక్కటంతో సాధుబాబా నోటిలోని మాట సగంలోనే ఆగిపోయింది. గిరుక్కున వెనుదిరిగి చూశాడు.

ఆజానుబాహువులాటి మనిషి, క్రూరంగా, వికటంగా నవ్వాడు. అతని చెయ్యి సాధుబాబా మెడమీద మరింత బిగిసింది. కబంధహస్తంలాటి ఆ చేతిపట్టులో ఊపిరాడక గిలగిల్లాడాడు సాధుబాబా.

"దొంగ రాస్కెల్! పిచ్చిదిగదాని పిచ్చివేషా లేద్దామనుకుంటున్నావా దొంగ సన్యాసి, ఖబడ్దార్!"

గడ్డిపరకని విసిరేసినట్లుగా సాధుబాబాని ఒక్క నెట్టు నెట్టాడు ఆ వ్యక్తి. సాధుబాబా రెండుగజాల దూరంలోవున్న గోడమీద తూలిపడ్డాడు. నుదురు చిట్లి రక్తం చిమ్మింది. తల దిమ్మెరపోయినట్లయింది.ఐదునిముషాలకిగానీ ఆ మైకంలోంచి తేరుకోలేకపోయాడు.

బాధగా కళ్లుతెరచిన సాధుబాబాకి ఎదురుగా, దర్జాగా, చిద్విలాసంగా నిలబడి తన్నే చూస్తున్న ఆ వ్యక్తే కనబడ్డాడు.

సాధుబాబా బాధగా తలపట్టుకుని అతన్ని పరీక్షగా చూశాడు. ఆరడుగుల పొడవున్న బలిష్టమయిన మనిషి, మాసిన పైజమా, లాల్చీ, మెలితిరిగిన మీసాలు, చిందరవందరగావున్న తల, దేనికీ వెనుకాడని చూపులు — అతను నడుంమీద రెండుచేతు లానించుకుని నవ్వుతూ, బాధగా తల పట్టుకుని అయోమయంగా చూస్తున్న సాధుబాబా వైపే చూస్తున్నాడు.

"సాధుబాబా! చాలా? మరొకటి కావాలా!" అన్నాడు హేళనగా నవ్వుతూ

సాధుబాబా గొంతు పెగల్చుకుని మాట బయటపడింది.

"నువ్వెవరు?"

అతను భయంకరంగా మరింత బిగ్గరగా నవ్వాడు.

"నేనా? ఎవరా? హహ, రతన్‌సింగ్ అంటే ఎవరో ఈ ప్రాంతంలో ఏ రాయిని, రప్పని అడిగినా చెప్తుంది. తెలిసిందా? మరోసారి ఈ ప్రాంతంలో కనబడ్డావో..."

సాధుబాబా శక్తి కూడదీసుకుని లేచి నిలబడ్డాడు మెల్లగా. వికృతంగావున్న ఆ మొహంలో ఏభావమూ తెలియటంలేదు. కరుగ్గా అడిగాడు.

"ఆమెకీ, నీకూ ఏమిటి సంబంధం?"

రతన్‌సింగ్ ఆ ప్రశ్న విని మరోసారి బిగ్గరగా నవ్వాడు.

"సంబంధమా? ఏమిటంటే ఆమె నా భార్య! తెలిసిందా? నా యింటి ఇల్లాలు, అర్థమయిందా? మరోసారి చెప్పనా?" రతన్‌సింగ్ తన సమాధానం పూర్తిచేసి కర్కశంగా సాధుబాబా వైపు చూశాడు.

"తెలిసిందా? గుర్తుపెట్టుకో" అంటూ దర్జాగా నడుస్తూ వెళ్ళిపోయాడు.

సాధుబాబా పిడుగుపడిన వాడిలాగా, నిశ్చేష్టుడయి అతను వెళ్ళినవైపే చూస్తూ నిలబడిపోయాడు. కళ్ళముందు జరుగుతున్న దేమిటో అర్థంకానట్టుగా అయోమయంగా చూడసాగాడు.

'భార్యా? నిజమా? ఇది నిజమా? ఎలా? ఎలాసంభవం!'

గొణుగుతున్నట్టుగా అనుకుంటూ కలలో నడుస్తున్న వాడిలాగా దోవాతెన్నూ తెలియనట్లుగా నడుస్తూ, అడ్డు తగిలిన రాతిబెంచీమీద అలాగే కూలబడిపోయాడు.

ఆ కుక్కిమంచంలో ఆమె పరిసరాలతో సంబంధం లేనట్టుగా ఎటో చూస్తూ అలాగే కూర్చుంది.

* * *

సూర్యుడు నడినెత్తికెక్కి, మెలమెల్లగా పడమటి ఆకాశంలోకి జారిపోతున్నాడు. సాధుబాబా అలాగే కూర్చున్నాడు. తననే పరీక్షగా చూస్తూ నిలబడిన వ్యక్తినిగూడా గమనించలేదు.

"ఏం భాయ్! ఇంకా మైకంలోంచి తేరుకోలేదా?" వీపు మీద బరువైన చెయ్యి, పకపకా నవ్వు వినబడి సాధుబాబా ఇహలోకంలో కొచ్చినట్టుగా తిరిగి చూశాడు. ఆ వ్యక్తే! సరాసరి వచ్చి సాధుబాబా పక్కగా కూర్చున్నాడు.

"ఆ! ఇప్పుడు చెప్పు. హిమాలయాలవరకు వెళ్లొచ్చావా? వింతలు విశేషాలు చెప్పు భాయ్".

సాధుబాబా ఓ క్షణం ఆశ్చర్యంగా చూశాడు అతని ధోరణికి. మెల్లగా అన్నాడు.

'జీవితానికి మించిన వింత విచిత్రం ఏముంటుంది!'

రతన్‌సింగ్ తల వెనక్కివంచి పకపకా నవ్వాడు.

"బాగా చెప్పావు భాయ్" అంటూ మళ్ళీ నవ్వాడు.

సాధుబాబా పట్టాలు మారుతున్న రైలుఇంజన్లని చూస్తూ అలాగే కూర్చున్నాడు.

"పెద్ద దెబ్బే తగిలినట్లుందే!" సాధుబాబానే పరీక్షగా చూస్తూ రతన్‌సింగ్ హఠాత్తుగా అన్నాడు.

అప్రయత్నంగా సాధుబాబా చెయ్యి నుదుటిమీదికి పోయింది. రతన్‌సింగ్ మరోసారి పకపకా నవ్వాడు.

"ఆ దెబ్బగురించి కాదు భాయ్ నే ననేది. జీవితంలో పెద్ద దెబ్బ తిన్నట్టున్నావే అంటున్నాను."

సాధుబాబా పెదవులమీద శుష్కహాసం మెరిసి మాయ మయింది. మనస్సులో ఒకటే ప్రశ్న రొదచేస్తోంది.

"మాట్లాడు భాయ్. మౌనంగా వుండేవాళ్ళంటే నాకు మహా మంట" అన్నాడు చిరాగ్గా రతన్‌సింగ్.

"అసలు నువ్వు సాధువుల్లో ఎందు క్కలిశావు?" అంటూ తనే ప్రశ్న వేశాడు.

సాధుబాబా మౌనంగా వుండిపోయాడు.

"బావుంది. నీకు మరో రకం పిచ్చల్లే వుంది" అన్నాడు రతన్‌సింగ్, తన ప్రశ్నకి జవాబు రాకపోవటం గమనించి.

"సరే, నేనే మాట్లాడతాను విను భాయ్. అసలు ఈ ప్రపంచంలో ఏదో ఓ పిచ్చిలేని మనుషులు ఎవరయినా వున్నారంటావా? డబ్బు పిచ్చి, పేరు పిచ్చి, ప్రతిష్ట పిచ్చి, ప్రేమపిచ్చి, పెళ్ళిపిచ్చి, సినిమా పిచ్చి, పెళ్లాం పిచ్చి, మొగుడుపిచ్చి. పిచ్చిలేంది ఎవరికో చెప్పుకో?"

సాధుబాబా హఠాత్తుగా నవ్వాడు.

"నీది ఏ రకం పిచ్చి?" రతన్‌సింగ్ అడిగాడు. సాధుబాబా మౌనంగా అలాగే వుండిపోయాడు.

"నే నొకటి అడగనా?" వున్నట్టుండి అడిగాడు సాధుబాబా.

'అమ్మయ్య! బండి పట్టాలమీది కొస్తోంది.' "ఊ! అడుగు" అన్నాడు రతన్‌సింగ్.

"ఆమెని...ఆమెని నువు పెళ్ళిచేసుకున్నావా? అయితే అక్కడెందుకుంది?" మనస్సులో తరుముకొస్తున్న ప్రశ్నలని మాటల్లో పెట్టాడు.

రతన్‌సింగ్ గంభీరంగా మారిపోయాడు. అప్పటివరకు నవ్వుతూ మాటలాడే ధోరణి హఠాత్తుగా మాయమయింది. సాధుబాబావైపు సూటిగా చూశాడు.

సాధుబాబా రతన్‌సింగులోని మార్పుని గమనించి బెరుగ్గాచూశా డతని వైపు. సాధుబాబా భయాన్ని గమనించిన రతన్‌సింగ్ పకపక నవ్వాడు. "భయపడకు. ఏం చెయ్యన్లే" అన్నాడు.

"ఏమిటి సంగతి? పిచ్చిదానిమీద పట్టించావు" నిదానంగా? సాధుబాబా వైపు చూస్తూ అడిగాడు.

సాధుబాబా తననే నిశితంగా చూస్తున్న ఆ కళ్ళని ఎదుర్కోటానికి తొట్రుపడ్డాడు. దూరంగా చూపు మరల్చు కుని మెల్లగా అన్నాడు.

"ఏంలేదు. ఒకొక్క వ్యక్తిని చూసినప్పుడు మన కెంతో ఆత్మీయుడుగా, కావలసిన మనిషిగా అనిపిస్తాడు, అందుకని.'

రతన్ మౌనంగా కూర్చున్నాడు మెలికలు తిరుగుతున్న రైలుపట్టాల వైపుచూస్తూ.

"అవును. నువ్వన్నదినిజమే. పొద్దున్న నిన్ను తలపగిలేట్టు కొట్టానా? అయినా యిప్పుడు నిన్ను చూస్తుంటే నాకు చాలా దగ్గరివాడివనిపిస్తోంది."

సాధుబాబా మెల్లగా నవ్వాడు.

"నువ్వన్నమాట నూటికి నూరుపాళ్లు నిజం భాయ్. జీవితాన్ని మించిన వింత విచిత్రం మరేం వుండవు," రతన్‌సింగ్ గొంతులో విచారంకాని భావమేదో బరువుగా పలికింది.

సాధుబాబా అతని మాటలు వింటూ అలాగే మౌనంగా కూర్చున్నాడు, రతన్‌సింగ్ మాట్లాడుతుంటే.

"నేను మంచిమనిషిగా వున్నప్పుడు, అంటే చాలా ఏళ్ళ క్రితం నా భార్యని కావాలని మనసుపడి చేసుకున్నాను. నా ప్రాణంకంటె ఎక్కువగా చూసుకున్నాను. ప్రతిక్షణం దాన్ని సంతోషపెట్టటానికే ప్రయత్నించాను. అయినా అదేంచేసిందో తెలుసా?

"దానికి సినిమాల పిచ్చి ఎక్కువ. ఓ రోజున ఇంట్లో వున్న నగానట్రా,డబ్బూదస్కం అన్నీ పట్టుకొని, పక్కింటి కుర్రాడితో లేచిపోయింది,

"నిజానికి నేనా షాక్‌నుంచి తేరుకుంటా ననుకోలేదు. కన బడ్డ ప్రతిమనిషిని ఖూనీ చెయ్యాలనిపించేది. ఎప్పుడయినా అది కనిపిస్తుందేమోనని కత్తిపట్టుకు తిరిగేవాడిని కొన్ని రోజులు. ఏమీ చెయ్యలేని నా చేతకానితనానికి నాకే ఏడు పొచ్చేది.

"కొన్నాళ్ళ తరువాత ఏదో చెత్త సినిమాలో దాసీదాని పాత్రలో అది ఓ క్షణం కనబడుతుందని ఎవరో చెపితే, ఆ సినిమా చూసొచ్చి తరువుతీరా నవ్వుకున్నాను. ఎందుకో తెలుసా?

"నా యింటికి రాణిగా వుండటంకంటె దానికి తెరమీద దాసీదానిగా ఓ క్షణం కనపడటమే బాగుందని తెలిసినప్పుడు మనసారా నవ్వుకున్నాను. ఇంతకంటె విచిత్రం మరేమయినా వుంటుందంటావా?

"మరి నాలో ఏం మార్పొచ్చిందో నాకే తెలియదు. వున్న

ట్టుండి అంతా నన్ను రౌడీ రతన్‌సింగ్ అంటం మొదలు పెట్టారు. నువ్వు నోరుమూసుకున్నంతవరకు అంతా నిన్ను మంచివాడంటారు భాయ్! ఎదురుతిరిగి ఒక్కటి లగాయించావో, హడిలిపోతూ నీకు దండం పెడుతూ పరిగెడతారు. నీ వెనక నువ్వొట్టి రౌడీవెధవ్వని ఏడుస్తారు.

"ఓ రోజు నా స్నేహితుడిని పంపటానికి స్టేషన్‌కొచ్చాను. తిరిగి తిరిగి అర్ధరాత్రి పోబోతుంటే 'కెవ్వు'మన్న కేక వినబడి వెనక్కి తిరిగిచూశాను. ఆ మూలగా ఓపిల్ల ముగ్గురు మనుషులమధ్యగా తెలివితప్పి పడుంది. జరగబోయేదేమిటో అర్థమయింది. ఆ ముగ్గురిమెడలువిరిచి చితక్కొట్టి పంపించాను. ఆ పిల్లకి తెలివివచ్చి, కళ్ళుతెరిచి అయోమయంగా చూస్తుందే తప్ప ఓమాట చెప్పదు. అడిగింది అర్థమయిందోలేదో తెలియదు. ఆ తీరు, వాలకం అయినింటి పిల్లవనే చెపుతున్నాయి. అందమయింది. వయసులో వుంది. అలాంటిచోట వుండటం ఎంత ప్రమాదకరం! ఆ పిల్ల భయంతో గట్టిగా పట్టుకున్న నా చేతిని చూస్తూ నేనో నిర్ణయాని కొచ్చేశాను.

"ఆ రోజునుంచి నా మకాం ఇక్కడికే మారిపోయింది ఆ అమ్మాయి ఈచోటు వదలిరాదని తెలిసిపోయింది. నేనా? నా అనేవాళ్ళులేని ఒంటరివాడిని.

"అడిగినవాడికి, అడగనివాడికి, ఈ చుట్టుప్రక్కల ప్రతి ఒక్కడికీ డప్పుకొట్టి మరీ చెప్పొచ్చాను, ఆ పిచ్చిపిల్ల జోలికి పోయినవాళ్ళు ప్రాణాలతో బయటపడరని.

"దానికీ నీకూ ఏమిటి సంబంధం?' అంటూ పనిలేని వెధవలు కొందరడిగారు. వాళ్ళ దృష్టిలో మగాడికి, ఆడదానికి ఉండేది ఒకే ఒక్క సంబంధం. అందుకని వాళ్ళ సంబంధాన్ని మా కంటకట్టకముందే నేనే చెప్పేశాను ఆ పిల్ల నా ప్రాణానికంటె ఎక్కువని.

"'నీ పెళ్ళామా!' అన్నారు. అవునన్నాను. అయితే నీ యింటికి తీసుకుపోక నలుగుర్లో వదిలావెందుకు?' అన్నారు. పళ్ళు రాలగొట్టాను. నోరుమూసుకొని తిరిగి చూడకుండా పరిగెత్తారు. మరా పిల్లజోలికి వెళ్ళటానికి ఒక్కడంటే ఒక్కడుగూడా సాహసించలేదనుకో.

"నాకు రౌడీగా పేరురావటం ఎంత మంచిదయిందో అప్పుడే తెలుసుకున్నాను. మంచిగావుండి చెయ్యలేని అనేక పనులు చెడ్డవాడిగా మారి, చెయ్యటానికి ఎక్కువ అవకాశం వుందని తెలిసొచ్చింది.

"చూస్తున్నావుగా? ఇన్నేళ్ళుగా ఇదే జీవితం. సత్రం భోజనం. మఠంనిద్ర."

రతన్‌సింగ్ చెప్పటం ఆపి బెంచీ వెనక్కి జేరబడి కూర్చుని ఆకాశంలో ఎగిరే పక్షుల్ని చూస్తూ కూర్చున్నాడు.

సాధుబాబా తలతిప్పి రతన్‌సింగ్ ముఖాన్ని పరికించి చూశాడు. ఆ ముఖంలో పొద్దుటి క్రూరత్వం, కఠినత్వం, పొగరుబోతుతనానికి బదులుగా మరేదో ఆవరించి కాంతివంతంగా ప్రకాశిస్తున్నట్లు అనిపించింది.

ఉన్నట్లుండి రతన్‌సింగ్ పకాలున నవ్వాడు. పక్షులను చూస్తూనే, పరాగ్గా అన్నాడు.

"ఒకొక్కసారి తన కోసం పిచ్చిదయిన ఏ దౌర్భాగ్యుడి అదృష్టానికోనాకు అసూయగావుంటుంది. మరోసారిరత్నాన్ని కాలదన్నుకున్న ఆ మూర్ఖు డి దురదృష్టానికి జాలివేస్తుంది."

సాధుబాబా మలినమయిన తన ముఖాన్ని పక్కకి తిప్పుకుని దూరంగా పోతున్న రైలుఇంజను కేసి చూడసాగాడు. ఇద్దరూ ఎవరి ఆలోచనల్లోవారు కొట్టుకుపోతున్నారు కనుచీకటివేళవుతోంది. దూరంగా స్టేషను లైట్లతో పెళ్ళి పందిరిలాగా వెలిగిపోతోంది.

సాధుబాబా తలతిప్పి దీర్ఘాలోచనలో పరధ్యాన్నంగా వున్న రతన్‌సింగ్‌కేసి పరీక్షగా చూసి మెల్లగా అన్నాడు.

"నువ్వామెని ప్రేమిస్తున్నావా రతన్?"

రతన్‌సింగ్ ఉలిక్కిపడినట్లు సాధుబాబావైపు చూశాడు.

"ఏమిటి అన్నావు?" అన్నాడు,

సాధుబాబా మెల్లగా నవ్వాడు. "రతన్ నువ్వామెని ప్రేమిస్తున్నావు."

రతన్‌సింగ్ చటుక్కున సాధుబాబా దృష్టినుంచి తన చూపుని తిప్పుకున్నాడు. రెండుక్షణాలాగి మెల్లగా నవ్వాడు.

"ప్రేమా? పిచ్చిదాంతో,మూగదాంతో ప్రేమేమిటిభాయ్?" రతన్‌సింగ్ కంఠంలో దాచినా దాగని భావమేదో బరువుగా పలికింది.

సాధుబాబా మనసులో ఒక్కసారిగా అసూయ అలలాగా పరుగెత్తి మాయమయింది. మరుక్షణం గుండెల్ని చీల్చుకుని వెలువడిన నిట్టూర్పుకి రతన్‌సింగ్ తిరిగిచూశాడు

"ఆదే మన కంతుపట్టని విచిత్రం!" మెల్లగా పలికిన సాధుబాబా మాటలు తనని దీర్ఘాలోచనలో పడేసినట్లుగా రతన్‌సింగ్ మౌనంగా చాలాసేపు అలాగే కూర్చుండిపోయాడు.

హఠాత్తుగా సాధుబాబా రతన్‌చేతిని తనచేతుల్లోకి తీసుకుని మెల్లగా అన్నాడు "ఆ భగవంతుడు నిన్ను చల్లగా చూస్తాడు రతన్."

ఆ కనుచీకటిలో సాధుబాబా కన్నీరు రతన్‌సింగ్ గమనించలేకపోయాడు. ఆశ్చర్యంగా చూస్తూ "ఎందుకు?" అన్నాడు.

"విధివశాత్తు చేయిజారిన వజ్రం, పగిలి ముక్కలయి నామారూపాల్లేకుండా నశించిపోకుండా కాపాడినందుకు!"

రతన్‌సింగ్ పకపకా నవ్వాడు. "సినిమా డైలాగ్స్ మాట్లాడుతున్నావేమిటి భాయ్?" అన్నాడు.

"రతన్, నే నొకటి అడగనా?"

"ఆమెకి పూర్వస్మృతి కలుగుతుందేమో నేను ప్రయత్నించనా."

రతన్‌సింగ్ ఆశ్చర్యంగా, సంభ్రమంగా చూశాడు.

"సాధుభాయ్! నిజమయిన సాధువులదగ్గర ఎన్నో మహిమలుంటాయని విన్నాను. నిజంగా నీ కలాంటి వేమయినా తెలుసా?" ఆతురతగా అడుగుతున్న రతన్‌సింగ్‌ని చూసి సాధుబాబా మౌనంగా నవ్వి వూరుకున్నాడు.

రతన్‌సింగ్ దూరంగా సమాంతరరేఖల్లాగా అనంతంలో కలుసుకున్నట్లుగా కనబడే రైలుపట్టాలనే తదేకంగా చూస్తూ వుండిపోయాడు.

* * *

అర్ధరాత్రి దాటిపోతోంది. ఆమె కుక్కిమంచంలో నిద్రపోతోంది. ఎదురుగా గోడకి చేరబడి కూర్చున్న సాధుబాబాకి నిద్రాదేవత ఆమడదూరంనుంచే పారిపోతోంది. ఎదురుగా సిమెంటు బెంచీమీద రతన్‌సింగ్ గాఢనిద్రలో వున్నాడు.

సాధుబాబా మంచంలో ప్రశాంతంగా నిదురిస్తున్న ఆమె వైపు, గాఢనిద్రలోవున్న రతన్‌సింగ్ వైపు మార్చి మార్చి చూస్తూ, పరధ్యాన్నంగా కూర్చున్నాడు. అలసటగా మూసుకున్న కళ్ళనుంచి అవిరళధారగా కన్నీరు కురుస్తోంది.

'భగవాన్! ఏమిటి నీ లీలలు? ఎందుకిలా జీవితాలతో చెలగాటమాడి ఆనందిస్తావు? కరుణామయుడ వన్నారే, కారుణ్యపాత్రుడి వన్నారే! ఇంత కఠినత్వం నీలో ఎక్కడ దాగివుంది ప్రభూ? ఇది నీకు వినోద లీలా తండ్రీ? నువు ప్రసాదించిన ఈ విలువయిన జీవితాన్నే అంతలో విషాదమయంగా కలలాగా కరిగిపోనిస్తావెందుకు భగవాన్? ఏమిటి లీలలు? దీని కర్థం ఏమిటి?'

సాధుబాబా మనసులో సముద్రఘోషలా మారుమ్రోగుతున్న ప్రశ్నలకి ఏ దైవం ప్రత్యక్షమయి సమాధానం చెప్పలేదు. యుగయుగాలుగాసాగే అన్వేషణలో ఏ మానవుడికీ ఇంతవరకు సరయిన సమాధానం దొరకలేదు. సాధుబాబా అనగా ఎంత!

"నూర్!" సాధుబాబా ముందుకి వంగి మెల్లగా పిలిచినట్లుగా పలికాడు. ఉలిక్కిపడినట్లు ఆమె కళ్ళు ఒక్క క్షణం రెపరెపలాడాయి. ఒకే ఒక్క క్షణం కళ్ళెత్తి సాధుబాబావైపుచూసింది. మెరిసే గాజుకన్ను, మొహంమీది భయంకరమయిన గాయంమచ్చ, పెరిగిన తల, గడ్డం, మరింక చూడలేనట్లుగా దృష్టిని తిప్పుకుని మరోవైపు చూడసాగింది.

"నూర్' సాధుబాబా మరోసారి మెల్లగా పిలిచాడు.

గుండెలు వడివడిగా కొట్టుకుంటున్నట్లుగా బలహీనమయి ఆమె వక్షం ఎగిరెగిరిపడింది! మరిచిపోయినదేదో బలవంతాన జ్ఞాపకానికి వస్తున్నట్టుగా ఆమె కళ్ళు విశాలమయి, అదృశ్యదృశ్యాలని గమనిస్తున్నట్లుగా సాలోచనగా తీక్షణంగా ఎటో చూడసాగింది.

సాధుబాబా ఆమెకి దగ్గరగా కూర్చొని గొంతు విప్పి మెల్లగా మాట్లాడసాగాడు.

"నా స్నేహితుడు అమర్ అని ఒకడు వుండేవాడు" ఆమెకి అర్థం అవ్వాలన్నట్టుగా అదేమాటని తిరిగి రెండుసార్లు ఉచ్చరించాడు.

ఆ పేరు విని ఆమెకళ్లు నీటిలోని చేపపిల్లల్లాగా కదలాడినాయి.

"అతనికి కాలేజీలో చదివేటప్పుడు ఒక స్నేహితురాలుండేది. కాదు కాదు, ఆమె స్నేహితురాలు మాత్రమేగాదు. అతని ప్రేయసి! అతని ప్రాణం; అతని సర్వస్వం! ఆమె పేరు...ఆమె పేరు...నూర్జహాన్."

సాధుబాబా గొంతు గాద్గదికమయింది. కన్నీటి తెరలలో గతం కళ్ళముందు నిలిచింది. ఆమె విప్పారిన నేత్రాలలో ఎన్నెన్నో దృశ్యాలు కదిలిపోతున్నాయి.

* * *

కాలేజీ గంట గణగణ మ్రోగింది. అంతా క్లాసులకి వెళ్ళిపోయారు. అమర్ గబగబా మెట్లెక్కుతున్నాడు. పైనుంచి మరింత వేగంగా దిగుతోంది నూర్జహాన్. మెట్ల మలుపులో అమర్‌కి ఢీకొట్టినంత పనిచేసి, ముందుకి తూలిపడిపోకుండా చట్టుక్కున రెండు చేతులతోనూ అమర్‌ని గట్టిగా పట్టుకుంది నూర్జహాన్. అప్రయత్నంగా తన గుండెలమీద మల్లెపువ్వులా వాలిన నూర్జహాన్ కిందికి దొర్లిపోకుండా ఒకచేతితో ఆమెని పట్టుకొని, మరోచేతితో రెయిలింగ్ పట్టుకొని తనుకిందికి జారిపోకుండా ఆపుకున్నాడు అమర్.

అమర్ చేతిలోని పుస్తకాలు కిందికి దొర్లిపోయాయి. నూర్జహాన్ చేతిలోని పుస్తకాలు ఎగిరి దూరంగా పడినాయి.

నూర్జహాన్ ఈ హఠాత్సంఘటననుండి తెప్పరిల్లి, అమర్ చేతిపట్టు విడిపించుకుని, నిలబడింది. ఓ క్షణం ఆమె ముఖం సిగ్గుతో ముద్దమందారలా ఎర్రబడింది. మరుక్షణం కళ్ళెత్తి అమర్‌వైపు చూసింది.

"సారీ పంతులు గారూ" పెదవులమధ్య నవ్వుని బిగపట్టుకుంటూ అంది.

ఆ సంబోధనకి ఆశ్చర్యంగా తలెత్తిచూసిన అమర్ ఆమె కొంటెతనాన్ని గుర్తించాడు. ఆమె నొకసారి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాడు.

"వసుంధరా సుందరి హరిన్మనోహర పల్లవ పరిధానము ధరించి, వికచప్రసూన భూషణాలంకృతయై, మాధవ సమాగమ, సంభ్రమ పుంస్కోకి లాలాపంబులు వెలయించు చుండె.''

అమర్ పాఠం అప్పజెప్పినట్టుగా గడగడా చదివేశాడు, చిరునవ్వుతో.

నూర్ అయోమయంగా చూసింది అమర్ వైపు, అతడన్న దాని అర్థమేమిటో ఆమెకి బోధపడక.

'వాట్ డుయు మీన్ బైదట్?' అమర్ ని పరిశీలనగా చూస్తూ, కోపంగా అడిగింది.

అమర్ మెట్లమీదుగా పడిన పుస్తకాలు ఏరి తీస్తూ, 'డోంట్ బాదర్ ఎబవుటిట్' అన్నాడు మెల్లగా నవ్వుతూ.

'అంటే' నూర్ కి కోపం, అనుమానం మరింత ఎక్కువ యింది.

'అంటే దానిఅర్థం మీరు తెలుసుకోకపోవటమే మంచిది అని', పుస్తకాలు బొత్తి పెడుతు అన్నాడు అమర్.

'తెలుసుకుంటే?' నూర్జహాన్ మహారాణిలా మెట్లమధ్య ఠీవిగా నిలబడి ప్రశ్నించింది.

'బహుశా మీకు కోపం వస్తుంది' మెట్లకిందుగా నిలబడిన అమర్ తలెత్తి ఆమెనిచూస్తూ చిరునవ్వుతో అన్నాడు.

'ఐవాంట్ టు నోద మీనింగ్ ఆఫ్ ఇట్.'

ఆమె మాటల్లోని అధికారానికి అమర్ నవ్వుకున్నాడు. చిరునవ్వుతో ఆమెనే చూస్తూ మెల్లగా అన్నాడు.

'ఒకానొక సుందరి పచ్చని దుస్తులు ధరించి, వికసించిన పూలతో అలంకరించుకుని, ప్రియుని కలిసే సంభ్రమంతో...' నూర్ ముఖాన్నిచూసి అమర్ చటుక్కున ఆపేశాడు.

నూర్ తన ఆకుపచ్చని చీరవైపు, చీరమీది రంగురంగుల పూవులవైపు, తన మెడలోని, చెవిలోని పుష్పాకారంలోని ఆభరణాలవైపు మార్చి మార్చి చూసి, మండిపడుతూ అమర్ వైపు చూసింది.

'మిస్టర్ అమర్! మీరు కాలేజీకి వచ్చి నేర్చుకున్నది ఇదన్నమాట?' అంది తీవ్రంగా.

'అవునండీ, మరి నేర్చుకోకపోతే ఎలాగండీ? మీ స్పెషల్ తెలుగుబుక్ లో ఆ సమాసం వుందండీ' అన్నాడు అతి అమాయకంగా...

నూర్ కి అంతకోపంలోనూ నవ్వొస్తోంది అతని నటనకి.

'నే ననేది మీ సమాసాల సంగతికాదు. కనపడిన ఆడపిల్లలందరినీ ఇలానే వర్ణిస్తారా అని!'

'ప్చ్, రామ రామ. ఆ మాట నే ననలేదండీ! ఆయనెవరో రాశారు. కావాలంటే ఎవరినయినా అడగండి. పిలవమంటారా?'

అతని ధోరణిచూసి నిజంగానే ఎవర్నయినా పిలుస్తాడేమోనని భయపడింది నూర్.

'ఓహ్' విసిగిపోయినట్లుగా, అతనితో మరింక వాదించలేనట్లుగా అతని చూపులనుండి తప్పించుకొని మెట్లు దిగిపోయి చకచకా క్లాసువైపు నడవసాగింది నూర్. అమర్ కొంటెగా నవ్వుకున్నాడు.

'చూడండి మిస్......' వెనుకనించి అమర్ పిలిచిన పిలుపునికూడా వినిపించుకోకుండా ముందుకివెళ్ళి చటుక్కున ఆగిపోయింది నూర్. చేతిలోనుంచి జారిపడిన ఇంగ్లీషు బుక్ తీసుకోవటం మరిచిపోయింది. క్లాసులోంచి గంభీరంగా లెక్చరర్ పాఠం వినిపిస్తోంది. వెనక్కితిరిగి పరుగుపెడుతున్నట్లుగా మెట్లవైపు నడిచి పుస్తకంకోసం ఆ చోటంతా గాలించింది. బుక్ దొరకలేదు. క్లాసువైపు నడిచిపోతున్న అమర్ ని చూసి, 'మిస్టర్ అమర్... నా బుక్'అంది గట్టిగా.

అమర్ ఆగి, ఆమెకి అందించి, 'నేను పిలుస్తుంటే మీరు వినిపించుకోలేదు' అన్నాడు చిరునవ్వుతో.

నూర్ అతనివైపు ఓసారి తీక్షణంగా చూసి అతని చేతిలోని బుక్ ని విసురుగా లాక్కుని క్లాసువైపు పరుగుతీసింది.

'థాంక్స్ చెప్పటం కనీసపు మర్యాద' వెనకనుంచి అమర్ అన్నమాటలకి, నూర్ ఓసారి తలతిప్పి కోపంగా చూసి మరింత వేగంగా వెళ్ళిపోయింది.

లెక్చరర్ పర్మిషన్ కోసరం ఎదురుచూస్తూ, నూర్, అమర్ లు క్లాసుబయట నిలబడ్డారు. క్లాసులోని నలభైజతల కళ్లు ఇద్దరివైపు తిరిగాయి. ఇంగ్లీషులెక్చరర్ కళ్ళద్దాలలోంచి ఇద్దర్నీ పరికించి చూస్తూ, క్లాస్ బిగినయి పదినిముషాలయింది. ఇప్పటివరకు ఏం చేస్తున్నారు?' అంటూ తనరొటీన్ ఎంక్వయిరీ పూర్తిచేశాడు.

క్లాసులోని వెనక బెంచిల్లోంచి మెల్లగా నవ్వులు వినపడినాయి. నూర్ ముఖం, కోపంతోను, రోషంతోను ఎర్రబడింది. నమిలి మింగేట్టుగా లెక్చరర్ వైపు చూసింది.

'సారీ సర్! బస్సు మిస్సయింది' అంది కోపాన్ని అణిచిపెడుతూ. లెక్చరర్ అమర్ వైపు చూశాడు, సంజాయిషీ కోరుతున్నట్టుగా. అమర్ నోటినుంచి అప్రయత్నంగానే నిజం పలికింది. 'ఎక్స్క్యూజ్ మీ సర్. బస్సు మిస్సయ్యాను' అన్నాడు.

క్లాసంతా ఘొల్లుమంది నవ్వులతో. లెక్చరర్ చేతిలోని బుక్ తో రెండుసార్లు 'సైలెన్స్ ప్లీజ్, సైలెన్స్ ప్లీజ్' అంటూ, టేబుల్ మీద కొట్టాడు.

అప్పటిగ్గానీ అమర్ కి అర్థంకాలేదు అంతా ఎందుకు నవ్వింది. లెక్చరర్ మొహంమీద చిరునవ్వు తారట్లాడి మాయమయింది. 'ఎస్, ఎస్. కమిన్' అన్నాడాయన కళ్ళ జోడు సర్దుకుంటూ.

నూర్జహాన్ సిగ్గుతో, అవమానంతో మండిపోయింది. మింగేట్టుగా అమర్ వైపు ఓ చూపువిసిరి విసవిసా నడిచి వెనుదిరిగి వెయిటింగ్ రూమ్ వైపు వెళ్లిపోయింది. క్లాసంతా నవ్వులాపి ఆమెవెళ్ళినవైపే చూడసాగారు. అమర్ ఏమీజరగ నట్టు, తనకేం పట్టనట్టు క్లాసులోకి వెళ్ళి కూర్చున్నాడు. లెక్చరర్ ఓసారి అమర్ వైపు నూర్జహాన్ వెళ్ళినవైపు విచిత్రంగా చూసి పాఠం కొనసాగించాడు .

ఆ సాయంత్రం అమర్ బస్‌స్టాప్‌దగ్గరికి వస్తూ నూర్ బస్సుకోసం ఎదురుచూస్తూ నిలబడివుండటం గమనించాడు. అమర్ ఆక్కడికి చేరేలోగానే బస్సురావటం, నూర్ ఎక్కెయ్యటం జరిగిపోయింది. అమర్ పరుగుపెడుతూవచ్చి బస్సు అందుకున్నాడు. నిండుచూలాల్లాగా బస్సు ముందుకి కదిలిపోయింది.

మరో పదినిముషాల్లో తాము దిగవలసిన చోట దిగేశారు, అమర్, నూర్జహాన్లు. ఓసారి తలతిప్పి అమర్ వైపు కోపంగా చూసి చకచకా నడవసాగింది. అమర్ రెండంగల్లో సమీపించి పక్కగా నడుస్తూ 'చూడండి' అన్నాడు మెల్లగా.

తల తిప్పి నిప్పులుకక్కే చూపులతో అమర్ వైపు చూసింది. అమర్ ఒక్కక్షణం మాటలకి తడుముకున్నాడు. 'చూడండి' అన్నాడు తిరిగి.

"చూస్తూనే వున్నాను" విసురుగా వచ్చింది సమాధానం.

అమర్ కి నవ్వొచ్చింది. "అదికాదండీ" అన్నాడు మళ్ళీ.

"ఏది కాదండీ?"

కోపంతో ఎర్రబడిన ఆమె మొహాన్ని చూస్తూ "అహ చూడండి మరి!"అంటూ ఆమెకి మరికాస్త సమీపంగా వచ్చాడు.

నూర్ ఠక్కున ఆగిపోయి అతనికి అభిముఖంగా తిరిగి నిలబడింది. "ఏయ్ మిస్టర్! ఏం? నవ్వులాటగా వుందా? సిగ్గువెయ్యటంలా ఇలా ప్రవర్తించటానికి?" అంది సూటిగా చూస్తూ.

"చూడండి! మరి ప్రొద్దుట నేనుకావాలని అలా చెప్పలేదు. నిజంగా బస్సుమిస్సయ్యాను" అన్నాడు సంజాయిషీ చెప్పుకుని ఆమెని చల్లబడమన్నట్టుగా చూస్తూ.

"అయితే?" నూర్ కి ఆ సంగతి తెలుసు. అతను నిజం చెబుతున్నాడన్న విషయం, ఇద్దరూ బస్సుమిస్సయి తరువాత బస్సులో వెళ్ళటం ఆమెకీ జ్ఞాపకమే. అయినా క్లాసువాళ్ళ నవ్వులు చెవుల్లో మారుమ్రోగుతుంటే నూర్ కోపం చల్లారటంలేదు.

"అయితే ఏమిటి?"

అమర్ కి ఆ పెదవులకదలిక మరీ మరీ చూడాలని పించింది. "ఏంలేదు. మీరు క్లాసుకి రాకుండా కోపంతో వెళ్ళిపోతేనూ, ఆ కోపం నామీదేమోనని..." అమర్ ఆమె కళ్ళలోకి మృదువుగా చూశాడు.

నూర్జహాన్ కి పొద్దుటి సంఘటన, తను మెట్లుదిగే వేగంలో అతనిమీద వాలటం తను పడిపోకుండా దృఢంగా పట్టుకున్న అతనిచేతి స్పర్శ, సిగ్గుతో తను సర్దుకుని నిలబడటం అన్నీ ఓసారి గుర్తుకొచ్చి మొహం ఎర్రబడి కనురెప్పలు వాలి పోయినాయి.

'ఓ...అదా!' అంది మరేం మాట్లాడాలో తెలియక.

'నా పొరపాటేదయినా వుంటే క్షమించండి' అమర్ మర్యాదగా మంచిబాలుడిలాగా క్షమాపణ కోరాడు.

నూర్ వెన్నలాగా కరిగిపోయింది. తన కోపానికి సిగ్గుపడు తున్నదానిలాగా 'అసలు ఈ స్టూడెంట్స్ అర్థం పర్థం లేకుండా ప్రతిదానికి ఎందుకు నవ్వుతారో తెలియదు' అంది మెల్లగా నడుస్తూ.

'బ్రహ్మచారీ, అందునా విద్యార్థి శతమర్కటహః అన్నారు గదండీ' అమర్ చిరునవ్వుతో చనువుగా అన్నాడు

"మరి మీరుకూడా..." నూర్ నవ్వు నాపుకుంది కొంటెగా.

"ఓ...అలా.. అవును నేనుకూడా" అంటూ నవ్వేశాడు అమర్.

"మరి విద్యార్థినులని ఏమంటారండీ?" పుస్తకాలని రెండుచేతులమధ్య గుండెల కదుముకుని తల తిప్పకుండా ప్రశ్నించింది.

అమర్ కళ్ళు కొంటెగా మెరిశాయి. 'లంఖిణీలంటారను కుంటాను' అన్నాడు అమాయకంగా, తనకి తెలిసింది చెపుతున్న ధోరణిలో.

నూర్ కి ఆ పదానికి అర్థం తెలియలేదు. హిందూ పురా ణాల్లో ఆ మాటని మంచికి వాడతారో లేక మరో అర్థాన్ని సూచిస్తుందో తెలియక అనుమానంగా అమర్ వైపు చూసి, అతని కొంటెతనాన్ని అర్థంచేసుకుంది.

'రేపు మీ తెలుగు లెక్చరర్ ని అడిగి ఆ పదానికి అర్థ మేమిటో తెలుసుకుంటాను' అంది అమర్ ని పక్కగాచూస్తూ.

'చంపారు పొండి. తెలుసుకుంటే తెలుసుకున్నారుగానీ నా పేరు మాత్రంచెప్పకండి' అన్నాడు తెలుగు శంకరశాస్త్రి గారి కోపాన్ని తలుచుకుంటూ భయంగా.

నూర్ హాయిగా నవ్వేసింది, గలగల పారే సెలయేరులా.

"దాని అర్థాన్నిబట్టి చెప్పటమో, చెప్పకపోవటమో ఆలోచిస్తాను" అంది బెదిరిస్తున్నట్టుగా.

"మీ దయ మరి" అమర్ ముందుకివంగి తలవంచి అన్నాడు వినయం నటిస్తూ.

ఇద్దరూ నూర్జహాన్ ఇంటిదాపులకి వచ్చారు. పురాతనమయిన రెండంతస్థులమేడ. విశాలమైన ఆవరణంనిండా పూలమొక్కలు, చెట్లు. క్రిందనుంచి పైమేడమీదకి తోరణాల్లాగా పాకుతున్న పూలతీగలు, కిటికీలకి, దరవాజాలకి అందమయిన పరదాలు, సంపదల కాలవాలమయి కొత్త పాతల కలయికలావుందా మేడ. నూర్ ఇంటిగేటులోకి తిరిగింది. అమర్ ముందుకి వెళ్లిపోయాడు.

లాన్‌లో కుర్చీలో కూర్చునివున్న అహమ్మద్‌ఖాన్‌గారు నూర్ అమర్ కలిసిరావడం గమనిస్తూనే వున్నారు.

విచ్చిన మల్లెపువ్వులాటి నవ్వు పెదవులమీద చిందులాడుతుండగా నూర్జహాన్ లోపలి కడుగుబెట్టి తండ్రి కెదురుగా వున్న కుర్చీలో కూర్చుంది. ఖాన్‌గారు కూతురిని చూసి పలకరింపుగా నవ్వారు.

"ఎవరమ్మా అతను?" అన్నాడు.

"అమర్ అని మా క్లాస్‌మేట్ నాన్నా. నువు పంతులుగారంటూ చెబుతావు చూడు మీ స్నేహితుడని, వాళ్లబ్బాయి"

ఖాన్‌గారి మనసు ముప్ఫైసంవత్సరాలు వెనక్కి వెళ్ళి తమ కాలేజీ చదువు, శాస్త్రి, రంగనాథం, రమణ, జుబేదా, పిలక జుట్టుతో కాలేజీకొచ్చే ఉమానాథశాస్త్రి, 'పంతులూ' అంటూ తాను అతన్ని ఏడిపించటం - అన్నీ ఓసారి గుర్తుకొచ్చాయి. బాల్యస్మృతులలో ఆయన మొహం చిరునవ్వు పులుముకుంది

"మహా గుండెనిబ్బరం, పట్టుదలగల మనిషిలే శాస్త్రి. మంచి ధర్మనిష్టగలవాడు." ఖాన్‌గారు పైకే మెచ్చుకోలుగా అన్నారు.

నూర్‌కి అప్రయత్నంగా నవ్వొచ్చింది. "బాబా, పొద్దున నా బుక్స్ కిందపడిపోతే అతను తీసి ఇచ్చాడు. నేనేమో 'థాంక్స్ పంతులుగారూ' అన్నాను. అప్పుడు చూడాలి అతని మొహం..."అప్రయత్నంగానే జరిగిన సంఘటనని గూర్చి తండ్రికి చెప్పి పట్టలేని ఆనందంతో నవ్వసాగింది. ఖాన్‌గారు నవ్వుతున్న కూతురివైపు పరీక్షగా చూశారు. ఆయన అంతరాంతరాల్లో ఇది మామూలు జోక్‌లాటిది గాదని, నూర్ నవ్వు వెనక మరేదో వున్నట్లు అనిపించి, తనుకూడా చిరునవ్వు నవ్వుతూ సాలోచనగా నూర్‌ని చూస్తూ వుండిపోయారు.

'బాబా, లంఖిణి అంటే ఏమిటి ?' అంది నూర్ వున్నట్టుండి.



"ఎందుకమ్మా? పాఠంలో వచ్చిందా?" అన్నారు. ఆయనకి శాస్త్రి, తనూ కలిసి తెలుగు చదవటం, తన బుర్రలోకి హిందూ పురాణాలని ఎక్కించటానికి శాస్త్రి పడినపాట్లు గుర్తుకొచ్చాయి. 'మా మతం మగవాళ్ళకి బహుభార్యత్వం ఒప్పుకుంటే మీ పురాణాలు ఆడవాళ్ళకి బహుభర్తృత్వం ఇచ్చాయల్లేవుందే' అంటూ తను నవ్వులాటపట్టిస్తే, కోపంతో కందిపోయిన శాస్త్రి, ద్రౌపది వివాహంలోని అంతరార్థాన్ని, అయిదుగురు భర్తలు అయిదు అంశలు అంటూ ఏదేదో తనకి అర్థమయ్యేట్టుగా చెప్పాలని ప్రయత్నించటం, 'రామ్ రహీమ్' అంటూ స్నేహితులంతా తామిద్దర్నీ పిలవటం ఖాన్‌గారికి అవన్నీ ఎంతో ప్రియమయిన రోజులుగా అనిపించసాగాయి. ఖాన్‌గారికి శాస్త్రిఅంటే అంతరాంతరాల్లో ఎనలేనిగౌరవము, అభిమానము వున్నాయి. తమ ధర్మాన్ని తనెంతగా ప్రేమించి గౌరవిస్తాడో, శాస్త్రి అంతకు వెయ్యిరెట్లు తన ధర్మాన్ని తుచ తప్పకుండా పాటిస్తాంచేవాడు. నిర్భయత్వంగల మనిషని!

"నీకు తెలియదా బాబా?" నూర్ హెచ్చరికతో ఖాన్‌గారు బాల్యస్మృతుల్నించి బయటపడ్డారు.

"ఏమిటమ్మా? ఓ లంఖిణి అంటే ఏదో రాక్షసి పేరనుకుంటాను" అన్నారాయన. నూర్‌కి ఓ క్షణం కోపం పొంగుకొచ్చి, మరుక్షణమే నవ్వు పొర్లుకొచ్చింది. పెదిమలు బిగించి నవ్వునాపుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది,

బస్సు ఆగగానే పరుగునవచ్చి ఎక్కే నూర్ ఆ రోజు బస్సు ఆగినా, ఎక్కే ప్రయత్నం చేయక నిలబడివుండటం కండక్టర్‌కి ఆశ్చర్యం కలిగించినట్లుంది. మరోసారి నూర్ వైపుచూసి విజిల్ వేశాడు. బస్సు ముందుకి కదిలిపోయింది. దూరంనుంచి బస్సు రావటం చూసి పరుగుపెట్టి వస్తున్న అమర్ మరో వందగజాల దూరంలో ఉండగానే బస్సు వెళ్ళిపోవటంతో నడక వేగం తగ్గించి మెల్లగా అడుగులేస్తూ స్టాప్‌దగ్గరగా వచ్చాడు. నూర్‌నిచూసి చిన్నగా నవ్వుతూ, "బస్సు వచ్చినా ఎక్కలేదేం? ఎవరికోసమయినా ఎదురుచూస్తున్నారా?" అన్నాడు.

నూర్ ఎర్రబడిన చెక్కిళ్ళని అతడు చూసిపోతాడేమోనన్నట్టుగా మొహం పక్కకి తిప్పుకుని, 'అవును, మా ఫ్రెండు వస్తానంది' అంది.

'ఐ సీ.'

మౌనంగా మరో రెండుక్షణాలు దొర్లిపోయాయి. పంగనామాల శెట్టిగారు బస్సుకోసరం ఎదురుచూస్తున్నట్లు నటిస్తూ నూర్‌కి సాధ్యమయినంత దగ్గరగా నిలబడటానికి ప్రయత్నిస్తూ ఆమెని కళ్ళతో తినేసేట్టుగా చూస్తున్నాడు.

*With best Compliments from*

# MEENA BAZAR

***(Sarees Specialsit)***

TILK ROAD (ABIDS), HYDERABAD - 500001

Phone : 46966

*NOW OFFERS YOU LATEST SAREES*

*In*

Banarasi, Kanchipuram, Dharmavaram, Bangalore, Venkatagiri, Chanderi, Kota, Tar-kam, Batik Printed Sarees, Cotton Sarees, Blouse Pieces to match every saree, Borders & Dress Materials, Zari Embroidary on Nylon's & Shiffons

SPECIAILSTS IN BANARAS & EMBROIDARY

నూర్ మరింత జరిగి అమర్ పక్కగా వచ్చింది. అమర్ నూర్ అవస్థ గమనించి చటుక్కున నూర్‌కి, శెట్టిగారికి మధ్యగా వచ్చి నిలబడి, కరుగ్గా శెట్టికళ్ళలోకి చూశాడు. శెట్టిగారు తడబడుతూ దృష్టి మరోవైపు తిప్పుకుని చూడసాగాడు.

అమర్ నవ్వుకుంటూ నూర్‌వైపుకు తిరిగి అడిగాడు.

''తెలుగు లెక్చరర్‌ని మీనింగ్ అడిగారా !''

''అడిగాను. రావణాసురుళ్లు వున్నచోట లంఖిణీలు కూడా ఉంటారని చెప్పారాయన.'' నూర్ అమర్ కళ్ళలోకి సూటిగా చూస్తూ చెప్పింది.

అమర్ చూపు తిప్పుకుని, పెదిమలు బిగించి నవ్వుకున్నాడు.

''ఐ సీ.''

"నిజమేనా ఆయన చెప్పింది?'' నూర్ కవ్వింపుగా అడిగింది.

"నిజమే అవ్వచ్చు. చెప్పింది 'ఉగ్రం'గారు గదా."

అమర్ నవ్వుకి నూర్‌కూడా జత కలిపింది. తెలుగు లెక్చరర్ శంకరశాస్త్రిగారికి కోపం ఎక్కువని ఆయనని అంతా 'ఉగ్రం' గారని మారుపేరు పెట్టి పిలుస్తారు. ఆయన కోపం వచ్చినప్పుడు ఎలా వూగిపోతూ మాట్లాడతారో గుర్తుకొచ్చి నూర్ మరింతగా నవ్వింది.

పిల్లిద్దరి వెనగ్గా నిలబడి ఇద్దర్నీ కోపంగా చూస్తున్న శెట్టిగారికి వాళ్ళ సంభాషణ ఒక్కముక్కగూడా అర్థం కాలేదు. పైగా వాళ్ళు తనని 'రావణాసురుడు' అంటున్నారా అన్న అనుమానంగూడా కలిగిందాయనకి. గుమ్మడికాయల దొంగకిమల్లే భుజాలు తడుముకుంటూ 'వెధవ చదువులు. ఆడా మగా మితీమీరిపోతున్నారు'అనుకుంటూ, రోడ్డుమధ్యగా వెళ్ళి కళ్ళకి చెయ్యడ్డుపెట్టి బస్సుకోసం ఎదురుచూడసాగాడు.

మరో ఐదునిముషాలకిదూరంగా బస్సు మలుపు తిరగటం చూసి, "మీ ఫ్రెండ్ రాలేదే ? బస్సు వస్తోంది ?" అన్నాడు అమర్.

"బహుశా రాదేమో!" నూర్ పక్కకి తిరిగి నవ్వాపుకుంది

బస్సు మరింత దగ్గరయింది. అమర్ అమాయకంగా అడిగినట్టుగా-

"మీరు మరికాసేపు ఆగుతారా మీ ఫ్రెండ్‌కోసరం ?" అన్నాడు.

''లేదు. వచ్చేస్తాను.'' నూర్ బుక్స్ గుండెల కానించుకుని రెండడుగులు ముందుకి వేసింది.


*IN THE SERVICE OF THE ROAD TRANSPORT*

YOU OWN THE VEHICLE
WE ADVANCE THE MONEY
AND
PAY AS YOU EARN

# THE SAHAYAK FINANCE & INVESTMENT CORPORATION LTD.

Registered Office
Post Box No. 132, 3-6-274 Himayathnagar,
HYDERABAD - 500029.

B. SREENIVASA RAO
Managing Director

"ఏం? మీ క్కావల్సిన వ్యక్తి వచ్చేశారా?"

అమర్ ప్రశ్నకి నూర్ మొహం ఒక్కసారిగా ఎర్రబడి, పచ్చని మొహం మరింత అందంగా మెరిసింది, సంజ కాంతిలో. చూపు తిప్పుకోలేనట్టుగా అదే చూస్తున్న అమర్ బస్సుహారన్‌కి ఉలిక్కిపడి నూర్‌ని అనుసరించాడు బస్సు వైపుగా. ఇద్దరు బస్సెక్కగానే దడదడలాడుతూ ముందుకి కదిలింది బస్సు రథంలాగా.

బస్సు ఫుల్‌గా వుంది. ముందుగా ఎక్కిన శెట్టిగారు ఓ చిన్న పిల్లాడిని పక్కకి జరిపి సర్దుకుని కూర్చోలేక అవస్థపడుతున్నాడు. నూర్ పక్కసీటుని పట్టుకు నిలబడింది. అమర్ పైకమ్మీ పుచ్చుకుని నూర్ వెనుకగా వున్నాడు.

బస్సు రయ్యినపోతూ స్టాపుల్లో సడన్ బ్రేకుతో ఆగుతోంది. పచ్చగా మెరుస్తున్న నూర్ మెడని, అలల్లాగా భుజంమీంచి ముందుకు వాలిన జడని, పక్కవాటుగా కనిపిస్తున్న నూర్ సున్నితమయిన చెంపని, నాజూకుగా నాట్యం చేస్తున్నట్లుగా ఉండుండి మెడను తాకుతున్న చెవిలోలకులను తన్మయంగా చూస్తున్నాడు అమర్. బస్సు ఒక్కసారిగా ఆగటంతో తూలి సీటు చివరగా ఆని కూర్చున్న శెట్టిగారి మీద పడ్డాడు. అమర్‌ని లక్ష కన్నులతో కోపంగా గమనిస్తున్న శెట్టిగారు బాధగా కేకపెట్టి 'మాయదారికాలం, మాయదారి బుద్ధులు' అనుకుంటూ అమర్ క్షమాపణలనిగూడా వినిపించుకోకుండా బస్సు దిగిపోయాడు. నూర్ చిరునవ్వుతో వెనుదిరిగి చూసింది. బస్సు ఒక్క కుదుపుతో బయలుదేరింది. అమర్ పక్కనున్న మామ్మగారిమీద పడబోయి నిలదొక్కుకున్నాడు. నూర్ చెయ్యి అడ్డుపెట్టి నవ్వు నాపుకుంది.

ఆరోజుకూడా ఖాన్‌గారు గేటుదగ్గరే కూర్చున్నారు, పైపు తాగుతూ. నూర్ గేట్లోకి తిరిగేవరకు ఒక్క క్షణం ఆగి, అమర్ ముందుకి సాగిపోయాడు. ఆయన కెందుకో ఈ వ్యవహారం ఏమాత్రం నచ్చలేదు. నూర్ పలకరింపుకి ముభావంగా తలూపి వూరుకున్నారు.

*　　　*　　　*

హౌరా ఎక్స్‌ప్రెస్ గీపెడుతూవచ్చి స్టేషన్‌లో ఆగింది. ఆమె కలలోంచి మేల్కొన్నదానిలా ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది. ప్రయాణీకుల గేటువైపుగా నడిచింది. సాధుబాబా గుండెల్ని చీల్చుకుని ఓ నిట్టూర్పు వెలువడింది. అప్పుడే అక్కడికి వచ్చిన రతన్‌సింగ్ నవ్వుతూ అడిగాడు 'ఏం భాయ్! ఎంతవరకు వచ్చింది నీ వైద్యం?' అంటూ. సాధుబాబా ముఖంమీద జీవంలేని నవ్వొకటి కదిలి అంతరించిపోయింది.

*　　　*　　　*


Phone : 662119

Grams : 'RANGARAJ'
Bombay, Andheri

*With the best compliments from*

# ORGANIC COATINGS PRIVATE LIMITED

91, Amrut Nagar, Kurla Road, Chakala,
Andheri (East), Bombay-169 AS

Manufacturers of
PRINTING INKS, ARTISTS' COLOURS & ALLIED PRODUCTS

మరో రోజు గతంలో కలిసిపోయింది. సాధుబాబా ఆమె కూర్చున్నవైపుగా నడిచాడు. ఆమె వదిలిన మల్లెపువ్వు లాగా మంచానికి జేరబడి ఎటో చూస్తోంది. అదే చూపు: అనంతంలో దేన్నో అన్వేషిస్తున్న చూపు. సాధుబాబా ఆమె పక్కగా వచ్చి తన చేతిలోని రెండు అరటిపళ్ళని ఆమె వైపుగా జాపాడు. ఆమె అతడిని గమనించిన చిహ్నాలేవీ కానరాలేదు.

''నూర్, దేవుడి ప్రసాదం తీసుకో'' ఆమె చెవిదగ్గర మెల్లగా అన్నాడు. ఉలిక్కిపడినట్టు ఆమెశరీరం ఒక్కసారి జలదరించింది. ఆ పిలుపు దేనినో తట్టి లేపుతున్నట్టుగా కళ కళపడుతూ అతనివైపు, చేతిలోని పళ్ళవైపు చూసింది. అవేవో మంత్ర ఫలాలయినట్లుగా వాట్లవేపే మంత్ర ముగ్ధలాగా చూడసాగింది.

'తీసుకో నూర్...ఈశ్వర్ అల్లా తేరేనామ్ కదూ?" అతనిగొంతు రుద్ధమయి మాటలు కన్నీటితో కలిసి పోయినాయి.

ఆమె గుండెలు ఆయాసపడుతున్నట్టుగా ఎగిరెగిరిపడు తున్నాయి. శరీరమంతా ఒక్కసారిగా రక్తం పొంగినట్టుగా ఎర్రబడింది. ఆ బుగ్గలు సిగ్గుల మొగ్గలయినట్లుగా కెంపు రంగు పులుముకున్నాయి. ఏవో మధురస్మృతుల జ్ఞాప కాలతో ఆ సుందర నయనాలు ఒక్క క్షణం మార్ధవంగా జీవాన్ని నింపుకుని కళకళలాడినాయి...

*     *     *

ఆ రోజు కాలేజీలో డిబేట్ మూలంగా నూర్, అమర్ బస్సు దిగేసరికి చీకటిపడిపోయింది. దోవలోనే రామ మందిరం వుంది. ఓ ఎత్తయిన అరుగుమీద చిన్నగదిలాంటి దాంట్లో సీతారామలక్ష్మణుల విగ్రహాలున్నాయి. ఆ పక్క ఇంట్లోని వైష్ణవుల కుర్రవాడు ఉదయం, సంధ్యల్లో దీపం వెలిగించి, పూలమాలతో విగ్రహాలని అలంకరించి పూజ చేస్తాడు. వచ్చిపోయే భక్తులంతా అక్కడ భరిణిలోని కుంకుమ తీసుకుని, దైవానికి పక్కగానున్న చిల్లుమూత డబ్బాలో కానుకలు వేసి వెడతారు.

అమర్‌కి రోజూ ఓక్షణం ఆ గుడిముందర నిలబడి భక్తిగా నమస్కరించి, కానుక వేసిరావటం అలవాటు. అప్రయత్నంగా అమర్ కాళ్ళు ఆ రోజు గూడా అటువేపే దారితీసినాయి. నూర్ అంత దూరంలో రోడ్డుమీదనే ఆగిపోయింది. వీధి దీపాలు వెలిగినాయి. దైవ విగ్రహాల ముందు ప్రమిదలోని దీపం దివ్యజ్యోతిలా ప్రకాశిస్తోంది. వెనక్కి తిరిగి నూర్ అక్కడే ఆగిపోవటం చూసిన అమర్ తిరిగి ఆమె దగ్గరగా వచ్చాడు.

For Quality Biscuits
Ask For
"AMPRO" Products

M/s. AMPRO FOOD PRODUCTS
A-3/1, Industrial Area, Nacharam,
HYDERABAD - 500039

"రండి. ఓసారి భగవంతునికి నమస్కరించి వెడదాం" అన్నాడు మృదువుగా.

నూర్ ఓ క్షణం అతనివైపు చూసి సందేహంగా నిలబడి పోయింది. అమర్ ఆమె సందేహాన్ని గమనించి చిరునవ్వుతో "ఏం? మా భగవంతుడని సందేహిస్తున్నారా?" అన్నాడు మెల్లగా.

నూర్ ఓసారి తదేకంగా దైవవిగ్రహాలవైపు చూసి అమర్‌వైపు తిరిగి మెల్లగా నవ్వింది.

"రండి. ఈశ్వర్ అల్లా తేరేనామ్ అన్నమాట వినలేదా?"

నూర్ మంత్రబద్ధలాగా అమర్ వెనుకనే నడిచి అతని సరసనే నిలబడింది. అమర్ కళ్ళుమూసి భక్తిపూర్వకంగా నమస్కరించి కానుక తీసి డబ్బాలో వేశాడు.

"నమస్కరించండి," అన్నాడు నూర్‌వైపు తిరిగి.

నూర్ ఒక్కక్షణం ఆ దీపకాంతిలో వెలుగుతున్న ఆ దేవతా మూర్తులని, అమర్‌ని మార్చిచూసి పమిటని తల మీదుగా తీసుకుని రెండుచేతులూ ఎత్తి కళ్ళు మూసుకుని నమస్కరించింది.

ఆ జ్యోతి వెలుగులో మేలిముసుగులో వికసించిన పద్మంలాగా, కళ్ళు మూసి, తామరతూళ్ళవంటి నాజూకయిన చేతులు జోడించి ప్రణామం చేస్తున్న నూర్‌ని చూసి అమర్ చలించిపోయాడు. తన్మయుడయ్యాడు. ముగ్ధుడయ్యాడు.

"నూర్" అప్రయత్నంగా ఆమెవైపు వంగి అతి మృదువుగా పిలిచాడు. మధుర మధురంగా, మంజులగానం లాగ వినపడిన ఆ పిలుపుకి నూర్ మెల్లగా కళ్ళు తెరచి అమర్ చూపుని గమనించి సిగ్గుపడిపోయింది. ఆ కళ్ళు బరువుగా వాలిపోయినాయి. తలవంచుకుని చిన్నగా వణుకుతున్న చేతుల్ని అదిమిపట్టి ప్రతిమలాగా అలాగే నిలబడి పోయింది.

పూజారి కుర్రాడు నోరు తెరుచుకుని నూర్ వైపు అమర్ వైపు వింతగా చూడసాగాడు. వాడికి నూర్ ఎవరో తెలుసు. రోజూ ఆ గుడికే భక్తుడయిన అమర్ వాడికి బాగా పరిచయమేను. వాడు ఆశ్చర్యంగా ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తూ, భగవంతుడి పాదాలవద్దనున్న రెండు అరటిపళ్ళు తీసి అమర్ చేతిలో వుంచాడు.

ఇద్దరూ వెనుతిరిగి రోడ్డుమీదకి వచ్చారు. అమర్ ఒక్కక్షణం ఆగి చెయిజాపి అరటిపళ్ళు ఆమెకి అందిస్తూ, "తీసుకోండి, భగవంతుడి ప్రసాదం" అన్నాడు. నూర్ మౌనంగా వాటిని అందుకుని జాగ్రత్తగా చేతిలో పట్టుకుంది.

'భగవంతుడిని ఏం కోరుకున్నారు?" నడుస్తున్న అమర్ హఠాత్తుగా ప్రశ్నించాడు.

*Deepali Greetings*
*to all our Valued Clients & Well Wishers*

GOLDEN PRESS

Gowliguda, Hyderabad. Phone : 44338

*Specialists in*

Carton Printing, Box Making, Varnishing
Quality Letter Press & Offset Printers

నూర్ కళ్ళెత్తి అమర్ వైపు ఓసారి చూసి తల కొద్దిగా పక్కకి తిప్పుకుని చిరునవ్వు నవ్వింది.

''రహస్యమా? చెప్పకూడదా?'' అమర్ ఆమెవైపుకి వంగి గుసగుస లాడుతున్నట్టుగా అతి మెల్లగా అడిగాడు.

నూర్ ఆ గొంతులోని తీయదనానికి పులకించి, మురిసి విరిసిన పుష్పమే అయింది. 'ఊహు, చెప్పను' అన్నట్టుగా పూగించింది.

"పోనీ నేను చెప్పనా ఏంకోరుతున్నానో?'' అమర్ ...డెగా అడిగాడు. నూర్ కుతూహలంగా చూసింది.

...భగవాన్, నా మనసుని ఓ లంఖిణి దోచుకుంది. ఆ పిల్ల ...నసులో ఏముందో తెలియటంలేదు. నువ్వయినా విప్పి ...ప్పకూడదా ప్రభూ అని'' అమర్ చేతులు జోడించి ...భినయించాడు.

నూర్ నవ్వునాపుకుంటున్న దానిలాగా చీరచెరగు నోటి కడ్డంపెట్టుకుని 'ఊ?' అంది ఓరగాచూస్తూ,' తర్వాత?' అన్నట్టుగా.

''అల్లాకి దయకలిగినట్లుగా లేదు నా మీద. పోనీ మీ రయినా చెప్పకూడదా ఆ సుందరి మనసులో ఏముందో?'' అమర్ హఠాత్తుగా అన్నమాటలకి నూర్ వివశంగా తన్ను తాను మరిచిపోతానేమో నన్నంత భయంగా, త్వరత్వరగా రెండుదగులు వేసింది.

''సరే, మీరలా భగవంతుడిని ప్రార్థిస్తూవుండండి. నేను వెడుతున్నాను,'' అంది వెనకకి చూస్తూ, వెనుకనుంచి ఓ సైకిలు గణగణ గంట మోగించుకుంటూ వచ్చి ఇరువురి మధ్యగా దూసుకుపోయింది. అప్రయత్నంగా ఇద్దరూ చెరోవైపుకి తొలగిపోయి. తూనీగలాగా దూసుకుపోతున్న సైకిలువాలాని చూసి నవ్వుకున్నారు.

నూర్ ఇల్లు దగ్గరపడుతోంది. మేఘాలమీద పూల రథంలో తేలిపోతున్నట్టుగా అడుగులు వేస్తోంది. తన పక్కన అమర్ ఉన్నాడన్న వూహకే ఆమె పులకించి పోతోంది. ఓరగా తలతిప్పిచూసిన నూర్ కి, టక్ చేసిన ఫుల్ హేండ్స్ షర్టు మోచేతులవరకు మడవగా, పచ్చగా, దృఢంగా, నడకకి లయబద్ధంగా ఊగుతున్న అమర్ చేతులను చూసి సిగ్గుపడింది. అమర్ ఆమె దృష్టిని గమనించి మెల్లగా నవ్వాడు. నూర్ చప్పున మొహం తిప్పుకుంది. నూర్ ఇల్లు సమీపించగానే అమర్ కళ్ళతోనే ఆమెవద్ద శలవుతీసు కుని ముందుకి సాగిపోయాడు. నూర్ తీయని ఊహలతో తేలిపోతూ ఎదురుగా వస్తున్న ఖాన్ గారికి ఢీకొట్టినంత పనయింది.


***With the best Compliments from***

## Nota Bene Enterprises & Prisma Sales

III-S-30, Lal Bahadur Stadium,
HYDERABAD -500001.
Tel : 37409

### REPUTED ELECTRICAL DEALERS

**Products handled :-**

1. Loadster Miniature Circuit Breakers
2. Larsen & Toubro Switch Fuses, Starters Etc.
3. Essen Deinki Control Components
4. Sumeet Mixers
5. M-Seal Epoxy Compound
6. D & H Secheron Welding Electrodes.

నూర్ తన్మయత్వాన్ని గమనిస్తున్న ఖాన్‌గారు "నూర్, ఇంత ఆలస్యమయిందేం''? అన్నారు గంభీరంగా.

నూర్ తడబాటుగా, చేతిలోని రెండు అరటిపళ్ళని ఖాన్‌గారికి కనబడకుండా రెండుచేతుల్లో పుస్తకాల కిందుగా పట్టుకుని, "ఇవాళ కాలేజీలో డిబేట్‌వుంది బాబా," అంది మెల్లగా. మరింక ఆగకుండా లోపలికి వెళ్లిపోయింది. ఖాన్‌గారు గేటువరకువెళ్ళి పరీక్షగా రోడ్డుచివరవరకు దృష్టి తిప్పి చూశారు. దూరంగా వెళ్ళిపోతున్న అమర్ ఆకారంచూసి ఆయన కనుబొమలు సాలోచనగా ముడివడినాయి.

* * *

సాధుబాబా బుగ్గలమీదుగా కన్నీరు జారి గుబురు గడ్డంలో కలిసిపోతోంది. ఆమెకళ్ళనుంచి మంచి ముత్యాల్లాగా జలజలరాలుతున్న కన్నీరు గుండెల్లో ఇంకిపోతోంది. హౌరామెయిలు గీపెడుతూవచ్చి స్టేషనులో ఆగింది. ఆమె కలలోంచి హఠాత్తుగా మేల్కొన్నట్లుగా ఉలిక్కిపడి లేచింది. తిరిగి కళ్ళలో అదేచూపు ప్రయాణికుల గేటువైపుగా నడిచింది. సాధుబాబా నిస్పృహగా ఆమెని చూస్తూ గోడకి జేరబడి కూర్చుండిపోయాడు. 'రతన్‌సింగ్ సాధుబాబా అవస్థని గమనించి మరేం ప్రశ్నించకుండా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

* * *

ఆమె కళ్లుమూసుకుని ఆ కుక్కిమంచంలో పడుకుని వుంది. బలహీనమయిన శరీరం, నీరసంగా వాలిన కనురెప్పలు. వడివడిగా జరిగే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆమె ఆరోగ్యం ఏమీ బాగాలేదని చెపుతున్నాయి.

సాధుబాబా మెల్లగా అటువైపుగా నడిచి, ఆమెని పరికించి చూశాడు. 'నూర్' అని అతిమెల్లగా. ఆమె చెవిదగ్గరగా పిలిచాడు. ఆమెరెప్ప లల్లలాడినాయి.

''నూర్, చూడు మల్లెలమాల. నీకోసం...నూర్." అతి ప్రయత్నంమీద ఆమెకళ్లు తెరుచుకున్నాయి. ఓ క్షణం ఆమె చూపు సాధుబాబా చేతిలోని మల్లెలమాలమీద నిలిచింది.

''నూర్...చూడు మల్లెలమాల...నువ్వెలా వున్నావో చెప్పనా?" ...సాధుబాబా కంటినీరు దివినుంచి భువికురికే గంగాభవానిలాగా ఆమె నుదుటిమీదకి జారుతోంది. ఒక్క క్షణం ఏదో జ్ఞాపకంచేసుకోవాలన్నట్లుగా ఆమె బలహీనమయిన చేతితో ఒకసారి ఆ మల్లెలమాలని తాకింది. మరుక్షణం జ్ఞాపకాల బరువులో ఆమె బాధగా కళ్లుమూసుకుంది. కంటి చివరలనించి ధారగా కన్నీరు జాలువారుతోంది. గంగాయమునల సంగమంలా సాధుబాబా కన్నీటితో ఆమె కన్నీరు కలిసిపోయి గతాన్ని చీల్చుకుని ప్రవహిస్తోంది.

* * *

అమర్ ఉత్సాహంగా, ఆతృతగా పార్కువైపు నడుస్తున్నాడు. గేటుదగ్గర పూలమ్మేకుర్రవాడు అమర్ కడ్డం నిలబడి 'సార్, సార్, కారుచౌక సార్? మూర రెండణాలే సార్ ! తీసుకోండి సార్' అంటూ గొడవచెయ్యసాగాడు.

అమర్ ఆగటానికి టైములేదన్నట్లుగా వాడి తట్టలోని మల్లెలమాలని ఎత్తిచూసి 'ఇదంతా ఎంతకిస్తావ్?' అన్నాడు.

వాడు ఆశ్చర్యంగా అమర్‌వైపుచూసి ఇదేదో కొనేబేరం కాదనుకుని మరో రూపాయి ఎక్కువేసి చెపుతూ 'నాలుగు రూపాయలవుతుందిసార్' అన్నాడు.

అమర్ జేబులోంచి ఐదురూపాయల నోటుతీసి వాడి చేతిలో వుంచి, తనే పూలమాలని చేతుల్లోకి తీసుకుని 'చిల్లర ఇవ్వనక్కర్లేదులే. మిగిలిన రూపాయి దాచుకో' అంటూ పార్కులోపలికి పరుగు పెడుతున్నట్లుగా నడుస్తూ వెళ్ళిపోయాడు.

పూలకుర్రాడు చేతిలోని నోటువైపు, తట్టలో మాయమయిన పూలవైపు, పరుగుపెడుతున్న అమర్ వైపు ఆశ్చర్యంగా,విచిత్రంగా,వింతగా,సంతోషంగాచూస్తూ నిలబడిపోయాడు.

పార్కులో అమర్ చెట్లు దట్టంగా పెరిగినవైపుగా నడిచి, మల్లెలమాలని జాగ్రత్తగా పట్టుకుని నలువైపులా పరికించి చూశాడు. దూరంగా అభిసారికలా, రాజహంసలా వయ్యారంగా, అలనాటి నూర్జహాన్‌రాణీలాగ ఠీవిగా, తన కలల రూపులా, పూల్రపోవులా నడిచివస్తున్న నూర్‌ని చూడగానే అమర్ మొహంలో కొంటెతనం తొంగిచూసింది. ఓ చెట్టు చాటున నక్కి నిలబడి నూర్‌ని గమనించసాగాడు.

నూర్ మరింత దగ్గరగావచ్చి, చుట్టూ ఓసారి తన విశాల నయనాలతో పరికించిచూసి, నిరాశ చిరుకోపం కలగలసిన చూపుతో దూరంగా పూలచెట్ల మధ్యగా పరుగెడుతున్న దోవకేసి చూస్తూ, ఓ చెట్టు నానుకుని నిలబడింది.

అమర్ చేతిలోని మాలని నాలుగువరుసలుగా చుట్టి, వెనుకనించి నిశ్శబ్దంగావచ్చి నూర్ మెడలో వేశాడు. పరధ్యాసగా నిలబడిన నూర్ ఉలిక్కిపడి ఒక్కఉదుటున వెనక్కితిరిగి, నవ్వుతూ నిలబడిన అమర్‌నిచూసి గుండెలు కుదుటపడినట్టుగా ఊపిరి పీల్చుకుంది. మరుక్షణం జరిగింది గుర్తుకొచ్చి సిగ్గులమొగ్గయి, అమర్‌ని కోపంగా చూసింది.

అమర్ సిగ్గుతో, చిరుకోపంతో ఎర్రబడిన ముద్దమందారంలాటి నూర్ ముఖాన్ని, సువాసనలను వెదజల్లుతూ, ఆమె మెడని చుట్టిన తెల్లని మల్లెలమాలని పరవశంగా చూస్తూ, ఆమెకి మరింత సమీపంగా వచ్చి, సిగ్గుతో వాలిన ఆమె ముఖాన్ని మెల్లగా పైకెత్తి ఆ కళ్ళలోకి తన్మయంగా చూశాడు.

నూర్ కలువరేకుల్లాటి కనురెప్పలు మెల్లగా పైకెత్తి అమర్ వైపు బేలగా చూసింది. అమర్ ఆ కళ్ళలో మెరిసిన కన్నీటిని చూసి, కలవరపడి, 'నూర్, ఎందుకీ కన్నీరు? ఏమయింది? కోపం వచ్చిందా,' అతి లాలనగా ప్రశ్నించాడు

'ఏం పనిచేశావు అమర్!' అంది మెల్లగా.

అమర్ నూర్ రెండుభుజాలమీద చేతులువేసి 'ఏం చేశాను?' అన్నాడు అమాయకంగా.

నూర్ దృష్టి ఓ క్షణం తన మెడలో సుతారంగా వూగుతున్న మల్లెలమాలమీద వాలి మరుక్షణం అమర్ మొహం మీద నిలిచింది. అమర్ ఆ కళ్ళలోని మరోప్రపంచాన్ని గమనిస్తూ బాహ్యప్రపంచాన్నే మర్చిపోయాడు. అందమయిన ఆ నేత్రాలలోని ప్రేమ, ఆరాధన, అతన్ని కట్టిపడవేసినయి.

ఇద్దరూ కాలాన్నే మరిచిపోయారు. అలా ఎంతసేపు నిలబడిపోయారో వారికే తెలియదు. దూరంగా కేరింతలు కొడుతూ, పరుగులుపెడుతూ ఆడుతున్న పసివాళ్ళ కేకలతో నూర్ ఉలిక్కిపడి, కలలోంచి మేల్కొన్న దానిలాగా చుట్టూ పరికించి చూసింది, ఎవరయినా తమనా అవస్థలో గమనించరేమోనని. మెడలోని మాలని మెల్లగా తీసింది. అమర్ చప్పున ఆ రెండు చేతుల్ని పట్టుకుని తలని వంచాడు. నూర్ చేతిలోని పూలదండ అతిసుతారంగా అమర్ మెడలో వాలింది. నూర్ సిగ్గుతో మొగ్గలాగా, అమర్ గుండెలమీది మల్లెలమాలలోని మరో మొగ్గలా అతని చేతుల్లో వాలింది.

'నూర్' మధురాతిమధురంగావున్న అమర్ పిలుపుని మరీమరీ వినాలన్నట్లుగా నూర్ మౌనంగా వుండిపోయింది.

అమర్ ఆమె తలని మృదువుగా పైకెత్తి, మూసుకున్న ఆ కనురెప్పలమీద అతి మృదువుగా పెదవులానించాడు.

నూర్ అతని గుండెల్లోతలదాచుకుని 'అమర్, నాకెందుకో భయంగావుంది.' అంది బేలగా.

'పిచ్చిదానా! ఎందుకు భయం! నిన్నంటి నీడలాగా అనుక్షణం నేను లేనా' అమర్ చేతులు ఆమెచుట్టూ మరింత బిగిసినాయి, ధైర్యం చెబుతున్నట్లుగా.

నూర్ తలెత్తి అమర్ మొహంలోకి తదేకంగా చూడసాగింది, తనకి కావల్సినశక్తి అతనిలోంచి అందుకుంటున్నట్లుగా.

'అమర్. మా యింట్లో మన పెళ్ళికి ఒప్పుకోరు' అంది విచారంగా.

'మా వాళ్లూ ఒప్పుకోరు'. అమర్ చిరునవ్వుతో చెప్పాడు.

'మరి...?'నూర్ ఆశ్చర్యంగా చూసింది అమర్ వైపు.

అమర్ మెల్లగా నవ్వి'వివాహమాడేది నువ్వూ, నేనూగాని, మీవాళ్లూ మావాళ్లూ కాదుగా' అన్నాడు.

అతని ధైర్యానికి నూర్‌కి గుండెలనిండుగా ఆనందం పొంగింది. ఆ నిబ్బరానికి ఆశ్చర్యంవేసింది. నూర్‌లోని భయం ఏ మూలకో పారిపోసాగింది.

'ఇంకొక్క మూడు నెలలాగితే నాకు డిగ్రీ వచ్చేస్తుంది నూర్. అప్పుడు ఎక్కడయినా దూరంగా ఉద్యోగం చూసుకుంటాను. నూర్, బహుశా నీకు మీ యింట్లో వున్నన్ని సౌకర్యాలు కలిగించలేకపోతాను. మామూలు జీవితానికి అలవాటు పడాల్సివుంటుంది. నూర్! నువు కష్టాల్ని సహించగలవా?'

అమర్ మాటల్ని మధురగానంలా వింటున్న నూర్ అతని భుజాలమీద చేతులువేసి గుండెలమీద తలవాల్చి, 'అమర్, నీతో ఎక్కడికయినా వస్తాను. ఎంతకష్టాన్నయినా సహిస్తాను. నువు నా పక్కనుంటే చాలు,' అంది మెల్లగా.

అమర్ మృదువుగా నూర్ తలని ముద్దుపెట్టుకున్నాడు.

'పద, వెడదాం. ఆలస్యమయిపోతోంది' అన్నాడు. అతన్ని విడిచి వెళ్ళటం ఇష్టంలేనట్టుగా తలఎత్తిచూసిన నూర్ నవ్వింది.

'అమర్! నువ్విప్పు డెలావున్నావో తెలుసా?'

'ఊఁ!'

'అచ్చు బారాత్‌కొచ్చే పెళ్లికొడుకులాగా.' అమర్ మెడలోని మల్లెదండలు అతని ముఖంమీదనించి వేస్తూ అంది.

'మరి నువ్వెలా వున్నావో చెప్పనా?' అమర్ మల్లెలమాల మధ్యనుంచి చూస్తూ అన్నాడు

నూర్ కుతూహలంగా చూసింది.

'సుహాగ్ రాత్‌కి దుల్హన్' అమర్ వంగి నూర్ ముఖం దగ్గర గుసగుసలాడాడు.

నూర్ గుండెలు వడివడిగా కొట్టుకుని, బుగ్గలు ఎర్రబడి, కళ్లు అర్ధనిమీలితాలయ్యాయి. అతనివైపు చూడలేనట్లుగా తలవంచుకుంది. అమర్ చిరునవ్వుతో తన మెడలోని పూలమాలని తీసి నూర్ భుజాలమీద వేశాడు. నూర్ మాలని అతి సున్నితంగా, భద్రంగా రెండుచేతుల్లో పుచ్చుకుని అమర్ వెనకే అడుగులో అడుగేస్తూ నడవసాగింది.

కనుచీకటి వేళయింది. దోవలో జనం అంతా నూర్ చేతిలోని అంత పెద్ద మల్లెలమాలని, నూర్‌ని, అమర్‌ని విచిత్రంగా చూస్తూ, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ, గుసగుసలాడుతూ, వెనక్కి తిరిగిచూస్తూ పోతున్నారు. నూర్ చాలాసేపటికిగానీ తన పరిస్థితి గుర్తించలేదు. గ్రహించిన తరువాత అమర్‌వైపు చూసింది.

అప్పటికే ఇద్దరూ వీధిమలుపు దగ్గరకి వచ్చారు. అమర్ మనసు చాలా ఉత్సాహంగా, ప్రసన్నంగావుంది. ఎదురుగా రామమందిరం. అమర్ దగ్గరగావెళ్ళి మనసంతా నిలిపి నమస్కరించాడు ఆ దివ్యమూర్తులకి. అమర్ వెనుకగావున్న నూర్ తన చేతిలోని మల్లెలమాలని మెల్లగా రెండుచేతులతోనూ దైవవిగ్రహాల పాదాలదగ్గర వుంచి, తలవంచి నమస్కరించింది. పూజారి కుర్రాడు నూర్ అమర్‌లవైపు, పూలమాలవైపు మార్చిమార్చి చూస్తూ, అమర్‌కి ప్రసాదాన్ని ఇవ్వటంకూడా మర్చిపోయాడు.

నూర్ ఇల్లు సమీపించగానే అమర్ అతిసున్నితంగా నూర్ చేతిని తాకి శలవుతీసుకున్నట్లుగా ముందుకి సాగిపోయాడు.

నూర్ అమరలోకాల్లో తేలిపోతూ ఇంట్లోకి అడుగు పెట్టి, ఎదురుగా గంభీరంగా సింహంలాగా నిలబడివున్న తండ్రినిచూసి ఒక్క క్షణం తడబడి లోపలికి వెళ్ళబోయింది.

'నూర్!' తండ్రి పిలుపులోని కాఠిన్యానికి నూర్ గజగజలాడిపోయింది. తండ్రికేసి చూస్తూ మాటలు రానట్టు నిలబడింది.

'ఇప్పటివరకు ఎక్కడున్నావు?' ఖాన్‌గారి కంఠం తుఫాను ముందరి ప్రశాంతతలాగా అతి గంభీరంగా వుంది.

నూర్‌కి గొంతు ఎండిపోయినట్లు పెదవులు విడివడలేదు. 'బాబా' అంది గానీ ఆమాటలు పెదవిదాటి బయటికి రాలేదు.

'ఆ కుర్రాడితో వున్నావుగదూ ఇప్పటివరకు?' తండ్రి ఘర్జనకి తుఫానులోని పూలతీగలా వణికిపోయింది. గుండెలు చిక్కబట్టుకుని తండ్రివైపు చూసి తలవంచుకుంది. మరో కారణం చెప్పేందుకు కూడా ధైర్యం కరువయింది.

'రేపటినుంచి కాలేజీకి వెళ్ళటానికిగానీ, అతనితో మాట్లాడటానికిగానీ, కలవటానికిగానీ వీల్లేదు. అర్థమయిందా? మరో విధంగా జరిగిందో...' పిడుగుల్లా తండ్రినోట్లోంచి వెలువడిన మాటలు కత్తుల్లా నూర్‌గుండెల్లో దిగబడినాయి.

'బాబా' అంది మెల్లగా కంపిస్తున్న పెదవులలో కన్నీరు జలజల కురిసింది.

'లోపలికి వెళ్ళు. చెప్పింది గుర్తుపెట్టుకో.' ఖాన్‌గారు మరణశిక్ష విధించిన న్యాయమూర్తిలా లోపలికి వెళ్లిపోయారు.

నూర్ నిర్జీవప్రతిమలాగా, కలలో నడుస్తున్నట్టుగా తన గదిలోకివెళ్ళి పరుపుమీద వాలిపోయింది. చండశాసనుడైన ఖాన్‌గారిప్రేమ, పట్టుదల, కఠినత్వం, అన్నీ నూర్‌కి బాగా పరిచయమే. నూర్ తల్లి గజగజలాడుతూ చాటుగావచ్చి వెక్కివెక్కి ఏడుస్తున్న కూతురి తల నిమురుతూ, తన కన్నీటినే అరికట్టలేకపోయింది.

మరుసటిరోజు వూరంతా గుప్పుమంది. శాస్త్రిగారబ్బాయి, ఖాన్‌గారమ్మాయి దండలు మార్చుకుని పెళ్లిచేసుకున్నారని.

* * *

మరుసటిరోజు ఖాన్‌గారు క్లబ్బుకి వెళ్ళినప్పుడు స్నేహితులంతా అభినందించసాగారు. ఎందుకో అభినందనలు తెలియని ఖాన్‌గారు తెల్లబోతుండగా,

'అలా చూస్తావేం ఖాన్‌భాయ్! కూతురిపెళ్ళి గుట్టు చప్పుడు కాకుండా జరిపించి. అందులో అలాటి ఇలాటి పెళ్ళా! కులాంతరాలనే కొట్టుమిట్టాడుతున్న రోజుల్లో మతాంతర వివాహమంటే ఎంత గుండెబలం కావాలి.'

పొగడటమో, తెగడటమో తెలియకుండా మాట్లాడారు కొందరు. 'ఖాన్‌జీ ఇంత అన్యాయమా? కూతురి పెళ్ళికి గ్రాండ్‌పార్టీ ఇస్తారని మేమంతా నోళ్ళు తెరుచుక్కూచుంటే. గుట్టు చప్పుడు కాకుండా జరిపించేస్తారా?'

'బాల్యమిత్రులు వియ్యమొందటం సంతోషించదగ్గ విషయమోయ్' అంటూ తలోమాటా అన్నారు.

'సరే, అయిందేదో అయింది. ఇప్పటికయినా స్నేహితులిద్దరూ పూనుకుని పబ్లిగ్గా ఇద్దరికీ ముడిపెట్టెయ్యండి' అన్నాడొకాయన సలహాగా.

ఖాన్‌గారు ప్రళయకాల రుద్రుడే అయ్యాడు. ఆ మాట అన్న స్నేహితుడిని పళ్ళురాలేట్లు కొట్టారు. పక్కవాళ్ళంతా విడిపించి ఖాన్‌గారిని శాంతపర్చడానికి ప్రయత్నించారు.

ఖాన్‌గారు మరింత ఉగ్రరూపం దాలుస్తూ, ఆ స్నేహితుడి చొక్కా పుచ్చుకుని, 'చెప్పు, నువ్వన్నమాటలకి ఋజువేమిటి?' అన్నారు వురుముతూ.

ఆ స్నేహితుడు ఖాన్‌గారి ఉగ్రరూపాన్నిచూసి బెదిరిపోతూ ప్రాణభీతితో 'నాకేంతెల్సు భాయీ. అంతా అనుకుంటున్నారు. మీ వీధిలోని రామమందిరంలోని పూజారి కుర్రాడు మీ అమ్మాయి, శాస్త్రిగారి అబ్బాయి దండలు మార్చుకుంటుంటే ప్రత్యక్షంగా చూశాట్ట. అటువైపుగా పోతున్న రాఘవయ్య, ఆనందరావు, మస్తానుకూడా చూశార్ట" అన్నాడు వణికిపోతూ.

ఖాన్‌గారు చప్పున అతన్ని వదిలేసి ఆలోచిస్తున్నట్లుగా నిలబడిపోయారు. నూర్...తను అల్లారుముద్దుగా, ప్రాణప్రదంగా పెంచిన నూర్-తన గారాల కూతురు అంత పని చేసిందంటే ఆయనకి నమ్మశక్యం కాకుండా వుంది. ఏదో కలలో జరుగుతున్న సంఘటనని చూస్తున్నట్టుగా వుందాయనకి.

లోకం తీరుతెన్నుల్ని ఆకళించుకున్న ఖాన్‌గారికి ఇదుగో

లోకమంటే అదుగో పులి అనేరకం ప్రజలు బాగా తెలుసు. కానీ నిప్పులేందే పొగరాదన్న మాటకూడా అబద్ధమనలే మన్న విషయంకూడా తెలుసు. ఏదో జరిగింది...ఏదో జరిగింది...ఏంచెయ్యాలి...తను లోకంనోరు కప్పలేడే...

సింహంలాటి మనిషి ఒక్కసారిగా నీరసపడినట్లయి, ఏడుపు ముంచుకొచ్చింది. మారుమాట లేకుండా వచ్చి కారు సీట్లో చేరబడ్డారు. ఆయన పరిస్థితి గమనించిన మరో శ్రేయోభిలాషి కారు వరకు పరుగెత్తుతూ వచ్చాడు.

'చూడు ఖాన్‌భాయ్, వేడి రక్తం, వయసు పొంగు తెలియక ఏదో చేసుంటారు. ఆ పిల్లని కాళ్ళూచేతులూ కట్టి నాలుగురోజులు గదిలో పడేసి గడప దాటనివ్వకు. ప్రేమాగీమా క్షణంలో వదిలిపోతుంది. నువ్వనవసరంగా బాధపడకు' అంటూ స్నేహపూర్వక సలహా ఇచ్చిపోయాడు.

ఖాన్‌గారి రక్తం సలసల మరుగుతున్నట్లుగా అయింది. మారుమాట లేకుండా కారుని ముందుకి పోనిచ్చారు.

ఆగకుండా మోగుతున్న కారు హారన్‌కి నౌకర్లు హడలిపోతూ పరుగుపెడుతూ వచ్చి గేటు తెరిచి వొదిగి నిలబడిపోయారు.

ఖాన్‌గారు కారుని గేటు ముందరే వదిలేసి, కదిలే కారు మేఘంలాగా ఇంట్లోకి నడిచారు.

'నూర్' అంటూ ఆయన వేసిన కేకకి భవనం దద్దరిల్లిపోయింది. గదుల్లోవున్న కొడుకులు, కోడళ్ళు, నౌకర్లుచాకర్లు పరుగుపెడుతూవచ్చి, ఖాన్‌గారి ప్రళయస్వరూపం చూసి ప్రాణాలరచేతిలో పెట్టుకుని బల్లుల్లా తలుపులకి, గోడలకి అంటుకుని నిలబడిపోయారు. తల్లి పరుగుపెడుతూ నూర్ గదిలోకి వచ్చి నిశ్చేష్టురాల్లాగా నిలబడిపోయింది. నూర్ గది ఖాళీగా వుంది.

* * *

అమర్ గుండెలమీద వాలి వెక్కి వెక్కి ఏడుస్తున్న నూర్‌ని సముదాయించడం అతని తరం కాకుండా వుంది.

'ఎందుకు పిచ్చిదానా అంత భయపడతావు? ఇలా జరుగుతుందని మనం అనుకున్నదేగదా! భయపడకు.'

అమర్ ఊరడింపుని నూర్ ఏమాత్రం వినిపించుకోలేదు. 'అమర్ నీకు తెలియదు. నీకు తెలియదు. బాబా ఎలాటివారో నీకేమాత్రం తెలియదు. ఆయన మాటని కాదన్నవాళ్ళని నిర్దాక్షిణ్యంగా ఏమయినా చేస్తారు. నాకు తెలుసు బాగా.' నూర్ ఇంకా ఏడుస్తూనే వుంది.

అమర్ మార్గం ఆలోచిస్తున్నాడు.చిట్టచివరికి ఏదో తట్టినట్టుగా, 'నూర్! పాట్నాలో మా పెదనాన్న కొడుకు ఒకాయన వున్నాడు. సోషల్‌వర్కర్‌గా అతనికి మంచి పేరుంది. నేను వెంటనే అతని సలహా కోరుతూ ఉత్తరం రాస్తాను. జవాబు రాగానే ఏంచెయ్యాలో చూద్దాము.సరేనా? మరింక ఏడుపు మానెయ్. ఒక్క పదిరోజులు మనం కలుసుకోకుండా వుందాం. ఈ లోపల మీ నాన్నగారి కోపం తగ్గుతుంది. మనకి మార్గమూ దొరుకుతుంది ఒప్పుకున్నట్లేనా?'

నూర్ కళ్లు తుడుచుకుని అమర్‌వైపు చూసింది.మబ్బులు క్రమ్మిన ఆకాశంలా అతి భారంగా వుంది ఆ అందమయిన ముఖం.

'అమర్ నాకెందుకో చాలా భయంగా వుంది,' అంది అతని గుండెలని కరుచుకుని, అమర్ ధైర్యం చెపుతున్నట్లుగా నూర్ వీపునరాస్తూ చిన్న పిల్లల్ని బుజ్జగించినట్లుగా నచ్చచెప్పసాగాడు.

'పిచ్చిపిల్లా! ఇంతేనా ధైర్యం! ఈ మాత్రానికే ఇంత అధైర్యమా, ముందు ముందు ఇంతకుమించినవి ఎన్ని ఎదుర్కోవాలో తెలుసా!

నూర్ జాలిగా బేలగా చూసింది అతనివైపు.

'ఎప్పుడూ, ఏ పరిస్థితుల్లోనూ నన్ను విడిచిపెట్టవుగదూ?' చిన్నపిల్ల మాదిరిగా అమాయకంగా అడుగుతున్న నూర్ తలని రెండు చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు అమర్.

'ఇంత పిరికిదాని వనుకోలేదు నూర్. ఇంత చిన్న విషయానికి ఇంత అధైర్యమా? షేమ్ షేమ్ షేమ్!' నూర్‌ని నవ్వించటానికి ప్రయత్నించాడు.

ఏ ఊరడింపులకీ నూర్‌గుండె కుదుటపడటంలేదు. సింహంలాటి తండ్రిరూపమే ఎదురుగా నిలుస్తోంది క్షణక్షణం. నూర్ తలెత్తి అమర్‌వైపు చూసి బలహీనంగా నవ్వింది.

'ఇంక వెడదాంపద నూర్. నువ్వు ఇలా వచ్చినట్లు మీ నాన్నగారికి తెలిస్తే మళ్ళీ గొడవవుతుంది. ఒక్క పదిరోజులు ఓపిక పట్టు. పాట్నాలోని మా అన్నగారి వద్దనుంచి జవాబు రాగానే నిన్ను కలుసుకుంటాను.' నూర్ అయిష్టంగానే తలూపింది.

భయంభయంగా వెనుదిరిగి చూస్తూ, బెదురుగా ఇంట్లోకి అడుగుపెట్టిన నూర్ అక్కడే ఆగిపోయింది.

ఖాన్‌గారు బోనులో సింహంలా పచార్లు చేస్తున్నారు. ఇంట్లోని జనాభా అంతా గోడలకంటిపెట్టుకుని భయం భయంగా చూస్తున్నారు. నూర్ తల్లి చీరచెంగులో మొహం దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది.

నూర్‌కి పరిస్థితి అంతా ఒక్కసారిగా అర్థమయింది. తను తుదినిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నయ

మయిందని గ్రహించింది. అప్పటివరకు మామూలు ఆడపిల్ల లాగా అమర్ గుండెలమీద వాలి భయంతో ఏడ్చిన నూర్‌లో ఆస్థానే ధైర్యం, ఓ విధమయిన మొండితనం, తెగింపు కలగ సాగినాయి. నిర్భయంగా తలెత్తి తండ్రిముఖంలోకి చూసింది.

కూతురి నిర్భయత్వాన్ని గమనించిన ఖాన్‌గారు ఒక్క క్షణం తొట్రుపడ్డారు. అంతలోనే తన ఉగ్రరూపం దాలుస్తూ,

'ఎక్కడికి వెళ్లావ్ ?' అన్నారు గొంతులో ఏ భావం ధ్వనించకుండా

'అమర్‌ని కలుసుకోవటానికి.' నూర్ నిర్భయంగా పలికిన మాటలు విని ఆ హాల్లో మిగిలినవాళ్ళంతా ఆశ్చర్యంలో విస్తుపోయారు. కొంతని ఢీకొంటున్న గొర్రెపిల్లని చూసినట్టుగా చూశారు నూర్‌ని.

'నేను వద్దన్నా ఎందుకు వెళ్ళావ్?'

'వెళ్ళకుండా వుండలేకపోయాను.'

నూర్ జవాబుకి తల్లి వలవల ఏడుస్తూ లోపలి గదిలోకి పారిపోయింది ఖాన్‌గార్కి ఒక్క క్షణం ఏం మాట్లాడాలో తెలియక మరింత మండిపడిపోయారు మనసులో, నూర్ నిర్భయత్వానికి.

'అంటే అర్థం ?'

నూర్ తలఎత్తి ఓసారి తండ్రిముఖంలోకి చూసి తల వాల్చి, 'నేను, అమర్ పెళ్ళిచేసుకుందా మనుకుంటున్నాము,' అంది మెల్లగా అయినా దృఢంగా.

పిడుగుపడ్డట్టుగా అందరూ చేష్టలుదక్కి చూడ సాగారు.

'చేసుకుందా మనుకుంటున్నారా? చేసుకున్నారా ?' ఖాన్‌గారికి క్లబ్బులో జరిగిన అవమానం దహిస్తోంది. నూర్ జవాబులు అగ్నిలో ఆజ్యం పోసినట్లవుతున్నాయి ఆవేశంతో ఆయన శరీరం కంపిస్తోంది. 'తన నూర్ ...అల్లారు ముద్దుగా, అతిగారాబంగా తన చేతుల్లో పెరిగిన తనకూతురు, బాబా అంటూ పసిబిడ్డలాగా తనవడిలో కూర్చున్ననూర్ ... ఈనాడు తనకి ఎదురుగా నిలబడి నిర్భయంగా, నిస్సంకోచంగా, నిర్లజ్జగా...' ఖాన్‌గారు సహించలేకపోతున్నారు.

నూర్ మొహం ఒక్కక్షణం కందగడ్డలా ఎర్రబడింది. తలెత్తి తండ్రిని చూసింది ఓ క్షణం.

'మీకు తెలియకుండా ఏలా చేసుకుంటాం బాబా! అమర్‌కి ఏదయినా ఉద్యోగం దొరికిన తరువాత...'

నూర్ సమాధానం ఖాన్‌గారిని హేళనచేస్తున్నట్లుగా, పరిహసిస్తున్నట్లుగా, సవాల్ చేస్తున్నట్టుగా ఉంది. ఓక్షణం ఆయన చేతులు కంపించినాయి. ఆ బిగుసుకుంటున్న చేతుల మధ్య నూర్ మెడ నలిగిపోతుందేమో నన్నంత భయాందోళనలకి అంతా మిర్రిమిర్రి చూడసాగారు.

ఖాన్‌గారు తనని తాను అదుపులో పెట్టుకుంటున్నట్లుగా ఆ హాల్లో పచార్లు చేయసాగారు. చివరికి ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా నూర్‌వైపు సూటిగా చూస్తూ 'నూర్, నువ్వీఇంట్లో వుండదలుచుకుంటే అమర్‌ని శాశ్వతంగా మర్చిపోవాలి' అన్నారు శాసిస్తున్నట్లుగా.

నూర్ కిందకి చూస్తూ అలాగే నిలబడింది.

'విన్నావా?'

'నాకు తెలుసు బాబా ఆ విషయం,' అంది మెల్లగా తలెత్తి.

అన్నిటికీ సిద్ధపడి, తెగించినట్లుగా మాట్లాడుతున్న నూర్ జవాబులు ఖాన్‌గారికి కాల్చి వాతలు పెడుతున్నట్లుగా వున్నాయి.

'అయితే నువు అన్నిటికీ సిద్ధపడే వున్నావన్నమాట ?'

నూర్ మౌనంగా నిలబడింది.

'అమర్‌ని మర్చిపోలేనంటావు?'

'.........'

పక్కగదిలోంచి నూర్ తల్లి ఏడుపు వెక్కివెక్కి వినవస్తోంది.

ఖాన్‌గారికి ఒక్కక్షణం నూర్ కాళ్ళూచేతులు కట్టి పడేసి, అమర్‌ని కలుసుకోకుండా చెయ్యాలనిపించింది, తను కార్లో ఎక్కుతుండగా స్నేహితుడిచ్చిన సలహా జ్ఞాపకంవచ్చి అవమానంతో వుడికిపోయారు.

'నూర్! ఇదే నీ నిర్ణయమా ?' అది ఆయన ఆఖరి ప్రశ్నలాగా వినబడింది.

నూర్ కళ్ళు నీళ్ళునిండి మసకలువేసి, పరిసరాలు కదిలిపోతున్నట్టుగా వుంది. మెల్లగా తలెత్తి తండ్రిని సూటిగా చూసి తలదించుకుంది.

ఖాన్‌గారిని ఓడిపోయిన మనిషిని ఆవహించే అవివేకం, ఆవేశం పూర్తిగా ఆక్రమించుకున్నాయి.

'అదే నీ నిర్ణయమయితే తక్షణం ఇంట్లోంచి బయటికి వెళ్ళు.'

ఖాన్‌గారు పళ్లబిగబట్టి గురిచూసి విసురుతున్న కత్తుల్లాగా ఒకొక్కమాటే పలుకుతూ తర్జనితో వీధివైపు చూపించారు.

నూర్ అన్నలు ఓ అడుగు ముందుకి వేయబోయి తండ్రి ఉగ్రరూపాన్ని చూసి భయంతో ఆగిపోయారు. తల్లి రోదన హృదయ విదారకంగా వుంది.

నూర్‌కి భయం వెయ్యలేదు. ఏడుపు రాలేదు. తండ్రి మొహంలోకి చూసింది, నిర్భయంగా.

'ఒక్క పదిరోజులు వుండనివ్వండి బాబా, ఆ తరువాత వెళ్ళిపోతాను.'

అది ఖాన్‌గారి సహనానికి ఆఖరి పరీక్ష. అగ్నిపర్వతం బ్రద్దలయినట్లుగా ఆయన శరీరమంతా మంటలు ఎగసి, ఆవిర్లు కమ్ముకున్నాయి.

'వీల్లేదు. తక్షణం, ఈ క్షణం బయటకి ఫో... ఫిరజ్' అంటూ గావుకేక పెట్టారు.

నూర్ రెండో అన్న వణికిపోతూ ముందుకి వచ్చాడు.

'నూర్ వస్తువులు ఏవీ యింట్లో వుండటానికి వీల్లేదు. అన్నీ దానికి ఇచ్చెయ్. అక్కరలేనివి కుప్పవేసి తగలపెట్టు. దానిగుర్తు ఒక్కటిగూడా, ఒక్కటంటే ఒకటిగూడా ఈ ఇంట్లో వుండటానికి వీల్లేదు. తెలిసిందా? ఫో; వెళ్ళు...'

ఫిరజ్ ఏదో చెప్పబోయినవాడిలాగా చేతులు నులుము కుంటూ ముందుకి వచ్చాడు.

'వెళ్లు' ఖాన్‌గారి గర్జనతో హడలిపోతూ వెనక్కి పరుగు తీశాడు.

ఖాన్‌గారు నిశ్చల ప్రతిమలా నిలబడివున్న నూర్‌వైపు తిరిగారు.

'నూర్, ఈ క్షణంనుంచీ నువు నా బిడ్డవి కాదు. నీకు ఎవ్వరూ లేరు. ఫో, వెళ్ళు. జన్మలో ఎప్పుడూ కనిపించకు.'

ఖాన్‌గారు ఠీవిగా అడుగులేస్తూ ఆచోటు వదిలి వెళ్ళిపోయారు. ధఢాలున ఆయన గది తలుపులు గడియపడినాయి.

నూర్ తల్లి 'బేటీ' అంటూ ఒక్క పరుగునవచ్చి చేతులతో నూర్‌ని చుట్టబెట్టి వెక్కివెక్కి ఏడవసాగింది.

నూర్‌లో రోషం, అభిమానం పోటీలుపడుతూ పరుగులెత్తినాయి. మెల్లగా తల్లిని విడిపించుకుని తన గదిలోకి వెళ్ళింది. చిన్నపెట్టెలో తన బట్టలు సర్దుకుంది. తన దగ్గరున్న డబ్బుని పెట్టెలో పెట్టింది. చిన్ననాడు మేనమామ ఇచ్చిన బంగారునగలు మాత్రం పెట్టెలో పెట్టుకుంది. తండ్రి చేయించిన వస్తువులు ఒకటికూడా తాకలేదు. ఆచిన్న పెట్టెని చేతితో పుచ్చుకుని హాల్లోకి వచ్చింది. సోఫాలో తల వాల్చి కుమిలి, కుమిలి ఏడుస్తున్న తల్లిని ఓసారి చూచి, చందమామ తన అందమయిన వెన్నెలతో లోకాన్ని పలకింప చేసేవేళ, ఆ మహల్లోంచి బయటకి నడిచింది.

* * *

ఉమానాథశాస్త్రిగారు రోజూ అలవాటు చొప్పున పరమేశ్వరంగారి కోసం ఎదురుచూస్తున్నారు, చదరంగం ఎత్తుకోసం. మామూలువేళ దాటిపోయినా పరమేశ్వరంగారు రాలేదు. శాస్త్రిగారు మరో రెండు కబుర్లు పంపారు.


*To draw all your requirements of*

PAPER, BOARDS, PRINTING INKS, WEDDING INVITATIONS

under one roof

*CONTACT*

**BATCHU LINGIAH & SONS**

6, General Bazar, Secunderabad-(A.P.) Phone: 72997 Grams: Newsprint

*Branch at*

B-12-1062, Jawaharlal Nehru Road, Hyderabad. Phone: 41429

DISTRIBUTORS OF

1. The Arvind Boards & Paper Products Ltd., Bilimora
   (Mfg. of Quality Kraft Paper, Straw Paper & Straw Boards)
2. Paper & Pulp Conversions Ltd., Poona.
   (Mfg. of 'PAPCO' brand Deluxe Duplex Boards & File Boards)
3. Kesoram Rayon, Calcutta.
   (Mfg. of White & Colour Kesophane Transparent Cellophane Papers)
4. Shree Vindhya Paper Mills Ltd., Bombay.
   (Mfg. of 'DIAMOND COTE' Art Paper, Chromo Paper, Art Card and Black Centred Art Card)
5. Tribeni Tissues Limited, Bangalore.
   (Mfg. of 'GATEWAY' brand range papers)
6. Coates of India Limited, Madras.
   (Mfg. of Printing Inks)

*Stockists of :*

The Ballarpur Paper & Straw Board Mills Ltd., Ballarshah.

శాస్త్రిగారినే రమ్మని కబురు పంపించారు పరమేశ్వరంగారు. శాస్త్రిగారు ఆశ్చర్యపోతూ వెళ్ళారు.

'ఏం బాబాయి, ఇవాళ ఎత్తు వెయ్యటానికి రాలేదేం? ఒంట్లో కులాసాయేనా?' అంటూ పరామర్శించారు.

పరమేశ్వరంగారు నశ్యంపట్టు పీలుస్తూ శాస్త్రిగారివైపు చూశారు.

'అయితే నీదాకా వార్త రాలేదన్లేవుందే?' అన్నారు.

'ఏంవార్త బాబాయి,' అంటూ ఎదురుగా కూర్చున్నారు శాస్త్రిగారు.

'అయితే నీదాకా రాలేదన్నమాట. నే ననుకుంటూనే వున్నాన్లే. మావాడు ఉరుములేని పిడుగులాంటి ఈ కబురు విని ఎలా వూరుకున్నాడా అని!'

'సంగతేమిటో చెప్పు బాబాయ్' అన్నారు కించిత్ ఆశ్చర్యంగా శాస్త్రిగారు.

పరమేశ్వరంగారు పడకకుర్చీలో సర్దుకు కూర్చుంటూ, మరో పట్టు నశ్యం పీల్చారు.

'ఆ ఖాన్‌కూతురు, మీవాడు దండలపెళ్ళి చేసుకున్నార్ట గదా?' అన్నారు శాస్త్రిగారివైపు పరిశీలనగా చూస్తూ.

శాస్త్రిగారు చురుగ్గా కళ్ళెత్తి చూశారు. 'ఏమిటి బాబాయ్ హాస్యం?'

'హాస్యం కాదోయ్ నాయనా. మీవాడు, ఆ ఖాన్‌కూతురు దండలు మార్చుకుని రామమందిరానికి జంటగావచ్చి పూజలు చేశార్ట. కావాలంటే రంగనాధాచార్యులు మనవడిని అడుగు. వాడేగా అక్కడ పూజారి. వాడు స్వయంగా తన రెండు కళ్ళతో చూశాట్ట,' తాపీగా అన్నారు పరమేశ్వరంగారు.

ఉమానాధశాస్త్రిగారు ఓ క్షణం తను ఏ లోకంలో వున్నానా అన్న సందేహంలోపడి బలవంతాన ప్రస్తుతానికి వచ్చారు. ఆయన స్వతహాగా సంయమనంగల మనిషి. ఎంతటి నిష్ఠాపరుడో, అంతటి సమయోచనాపరుడుకూడాను. నిండుకుండలాగా తొణకని వ్యక్తి.

'నువ్వు చెప్పే కబురు నాకు నమ్మబుద్ధికాలేదు బాబాయి. అమర్ అలాంటిపని చేస్తాడంటే నేను నమ్మను,' అన్నారు. ఆయన గొంతులో కొడుకుమీదగల నమ్మకం ప్రస్ఫుటంగా ధ్వనించింది.

'నువ్వు నమ్మటం ఎవడిక్కావాలోయ్ తండ్రీ! వయసు నాయనా వయసు. ఆ వయసు ఎంతపనయినా చేయిస్తుంది. ఈ రోజుల్లో ఈ ప్రేమవివాహాలు గంటకొకటిగా వింటున్నవేగా?' అన్నారాయన తలనెరసిన అనుభవాన్ని మాటల్లోకి మార్చుతూ.

శాస్త్రిగారి మనసులో ఏముందో ఆ భగవంతుడికే


*With best Compliments from*

LIBERTY

CINEMA

*(House of Selected Motion Pictures)*

HYDERABAD

తెలియాలి. ఎవరింట్లో జరిగిన సంఘటననో వింటున్నట్లుగా ఆయన స్థిరంగా అలాగే కూర్చున్నారు.

ఈ వార్తవిని తబ్బిబ్బులయి, తలక్రిందులయి, అగ్నిహోత్రుడయిపోతాడనుకున్న శాస్త్రిగారు, నిశ్చలంగా కూర్చోవటం ముసలాయనకి ఏమాత్రమూ నచ్చినట్టులేదు.

'ప్చ్, ప్చ్, పిదపకాలం, కలియుగమని వూరికే అన్నారా? మరొహపిల్ల, మరొహపిల్ల కాదయ్యే. సాక్షాత్ తురకపిల్లని తీసుకొచ్చి ఇంట్లో పెడితే తరవాత జరిగేదేవిటో ఆలోచించుకో! నిప్పులు కడిగే మీ ఆవిడ భావిలో దూకుతుంది. పెళ్ళి కెదిగిన నీ ఆడపిల్లలు, పెళ్ళిళ్ళుకాక వురోసుకోవాల్సొస్తుంది. వూరిలో నీకు పచ్చి మంచినీళ్ళుకూడా పుట్టవు. ఇదేదో మొదట్లోనే తుంచెయ్. తరువాత నీ యిష్టం. నీ మంచి కోరి చెపుతున్నాను. పెద్దవాడిని,' అన్నారాయన తన పెద్దరికాన్ని సద్వినియోగపరుచుకుంటూ.

శాస్త్రిగారు గరళం మింగుతున్నట్టుగా తలవంచి ఆ వృద్ధుడి మాటలన్నీ విన్నారు. 'వస్తా బాబాయ్' అంటూ లేచొచ్చేశారు.

ఆయన ఇంటికి తిరిగివచ్చి తలనిండుగా స్నానంచేసి, భగవద్గీత పుచ్చుకుని వీధి అరుగుమీద కూర్చున్నారు. భార్యా, కూతుళ్లు ఆయనకి ఇంటి కాపలా అప్పచెప్పి, గుడిలో హరికథ వినటానికి వెళ్ళిపోయారు.

శాస్త్రిగారు దృష్టిని గీతాపఠనంలో లీనం చెయ్యటానికి ప్రయత్నిస్తున్నా, ఆయన మనసుమాత్రం అమర్ రాకకోసం వేయికళ్ళతో ఎదురుచూస్తోంది. చిట్టచివరికి అమర్ రానే వచ్చాడు.

నూర్‌ని ఓదార్చి, త్రోవలో పాట్నాలోని అన్నగారికి ఉత్తరం పోస్టుచేసి వస్తున్నాడు. ఆలోచనల్లో తలవంచుకుని వచ్చిన అమర్ తండ్రిని గమనించకుండానే లోపలికి పోబోయాడు.

'అమర్,' తండ్రి పిలుపుకి తలఎత్తి చూసి, దగ్గరగా వచ్చాడు.

'నీ పని కానిచ్చుకుని ఓసారి రా. నీతో మాట్లాడాలి' అన్నారాయన శాంతంగా. అమర్ తండ్రివైపు ఓసారి పరిశీలనగా చూసి, ఆ ముఖంలో ఏ భావాన్నీ పసికట్టలేక లోపలికి వెళ్ళిపోయాడు. మరో అరగంట తరువాత వచ్చి తండ్రి దగ్గరగా కూర్చున్నాడు.

శాస్త్రిగారు భగవద్గీతని మూసి వడిలో వుంచుకుని అమర్ వైపు సూటిగా చూశారు.

"అమర్! నేను విన్న విషయం ఎంతవరకు నిజం?" అన్నారు.

అమర్ ఆశ్చర్యంగా చూస్తూ, తండ్రి దేన్నిగురించి అడుగుతున్నారో చూచాయగా మనసులో సందేహం వున్నా


*With best compliments from :*

**SRI RAMA & CO.,**

**4-6-546, Esamiah Bazar,**

**HYDERABAD-500027.**

Phone : 51828

PRINTERS' PROVIDERS & DISTRIBUTORS FOR J. B. A. PRINTING INKS PVT. LTD., MADRAS — DEALERS IN PRINTING MACHINES, CUTTING MACHINES, WIRE STITCHING MACHINES AND COMPLETE ACCESSORIES OF LEAD, LEAD RULES, SPACING MATERIALS ETC.

'ఏ విషయం నాన్నా!' అన్నాడు మెల్లగా.

శాస్త్రిగారు ఓ క్షణం ఆగి అన్నారు. 'నువ్వూ ఆ ఖాన్ కూతురూ దండలు మార్చుకుని పెళ్ళిచేసుకున్నారన్నసంగతి!'

నిజానికి అమర్ ఆ వార్తని అప్పుడే వింటున్నాడు. తనకి తెలియకుండా తన పెళ్ళి ఎలా జరిగిందో తనకు బోధపడలేదు. అయినా నూర్ విషయం తండ్రి వరకు వచ్చిందన్న సంగతి గమనించిన అమర్ ఓ క్షణం మౌనంగా వుండిపోయాడు.

శాస్త్రిగారు కొడుకు సమాధానానికి ఎదురుచూస్తున్నట్లుగా మౌనంగా అతన్నే గమనిస్తూ కూర్చున్నారు. అమర్ తన మనసులో ఓ నిశ్చయానికి వచ్చాడు.

'మీరు విన్న విషయం పూర్తిగా నిజంకాదు నాన్నా,' అన్నాడు మెల్లగా అయినా దృఢంగా.

'నిజం ఎంత?'

అమర్ మొహం సిగ్గుపడినట్లుగా కిందకి వాలింది. మరుక్షణమే తలెత్తి తండ్రిముఖంలోకి చూశాడు.

'నూర్‌ని నేను వివాహమాడదలిచాను నాన్నా' అన్నాడు దృఢంగా.

శాస్త్రిగారు బయట చీకటిలోకి చూస్తూ మౌనంగా వుండిపోయారు. ఆయన కొడుకు నిర్ణయంలోని పట్టుదలని గమనించారు. మనసులో పాముల్లా మెలికలు తిరుగుతున్న ఆలోచనలని ఓ దారికి తీసుకురావటానికి ప్రయత్నిస్తున్నారు.

అమర్ తండ్రి మౌనం గమనించి ఆత్రుతగా ఆయన్నే చూడసాగాడు. చిట్టచివరికి ఆయనే మౌనాన్ని భంగం చేశారు.



'అమర్, నువ్వీ నిర్ణయాన్ని తీసుకునేముందు. మన ధర్మం, వంశం, ఆచారం, నీ తలిదండ్రులు, నీ అక్కచెల్లెళ్లు వీళ్ళని గురించి ఏమయినా ఆలోచించావా?' అతి సాధారణంగా అడిగారు.

అమర్ మనసు ఒక్క క్షణం వ్యధాభరితమయింది. అవన్నీ తను ఆలోచించని విషయాలు కావు.

శాస్త్రిగారు కొడుకుమీద భరోసావున్నట్లుగా అతనివైపే చూస్తున్నారు. జవాబుకి ఎదురుచూస్తున్నట్లుగా అమర్ తండ్రి చూపుని అంతే నిశ్చలతతో ఎదుర్కొన్నాడు.

'నాకు తెలుసు నాన్నా. మన ఆచారాలకి, ఈ వివాహానికి సరిపడదని: మీరు ఈ వివాహాన్ని అంగీకరించరనికూడా తెలుసు. మీ ప్రతిష్ఠకి భంగం కలిగించటం నాకూ చాలా బాధగానే వుంది నాన్నా. అందుకే నేను డిగ్రీ అయిపోయిన తరువాత మీ అందరికీ దూరంగా వెళ్ళి,ఉద్యోగం చూసుకుని వివాహం చేసుకోవాలని నిశ్చయించాను. అమర్ అనే వాడు మీ కడుపున పుట్టలేదనుకోండి నాన్నా!' అమర్ కళ్ళలో నీరు చిమ్ముకొచ్చింది. చటుక్కున దృష్టి పక్కకి తిప్పుకున్నాడు.


శాస్త్రిగారి కళ్లుకూడా తడిఅయ్యాయి. ఒక్కసారిగా ఆయనలోని పితృప్రేమ పొంగుకొచ్చి కదిలిపోయారు. కానీ ఆయన ఇంతింతకి పొంగి కుంగిపోయే మనిషికాదు. ఆయనని ఓవేపు పుత్రప్రేమ, మరోవేపు సంఘం, ధర్మం, భార్యాబిడ్డలు లాగుతున్నారు. బాధగా కళ్లు మూసుకున్నారు.

ఈ విషయంలో తను మరి చెయ్యదగిందికూడా ఏదీ కనపడలేదాయనకి. అమర్ నిర్ణయం తీసుకుంటే దాన్ని పాటించటంలో తనకి ముమ్మూర్తులా కొడుకేనని ఆయనకి తెలుసు. నిన్నటివరకు నవ్వుతూ, తుళ్లుతూ, నిర్విచారంగా కాలేజీకి వెళ్ళివొచ్చే కొడుకు ఒక్కసారిగా తను వూహించని ఎత్తుకు ఎదిగిపోయినట్లుగా ఫీలయ్యారు.

'అమర్ ఈ వివాహం మీ భావిజీవితాలమీద ఎలాటి ఫలితాలు కలిగిస్తుందో ఆలోచించావా?' కొడుకు ఇందులోని మంచిచెడులు పూర్తిగా ఆలోచించలేదేమోనన్నట్లుగా అడిగారాయన.

అమర్‌కి తండ్రిమీద ఎనలేని గౌరవం వుంది. అదిప్పుడు మరింత పెరిగిందే కానీ తరగలేదు. అమర్‌కి బాగా తెలుసు. తమ వివాహం జరిగిన మరుక్షణం తామిద్దరూ ఈ ప్రపంచంలో ఎవరూలేని జంటపక్షులని. సుఖదుఃఖాల్లో ఆనందించేవారుగానీ, ఆదుకునేవారుగానీ ఎవరూ వుండరని తెలుసు.నా అనేవారు లేని అనాధల్లాగా తమ జీవితాలని తామే తీర్చి దిద్దుకోవాలని తెలుసు.

'చెడుఫలితాలకే ఎక్కువ అవకాశం వుందని తెలుసు



నాన్నా. కానీ ఫలితాలని దృష్టిలో పెట్టుకుని నూర్‌ని వదులుకోలేను. దేన్నయినా ఎదుర్కోటానికి సిద్ధంగా వున్నాను.'

ఆయనకి అమర్ మీద జాలివేసింది. క్రూరమృగాల మధ్యకి లోకంతెలియని పసిబిడ్డని పంపుతున్నట్టుగా కదిలిపోయారు. కళ్ళుమూసుకుని కుర్చీలో జేరబడి కూర్చున్నారు. అమర్ తలెత్తి ఆకాశంలో నిర్మలంగా వెలుగుతున్న నక్షత్రాలకేసి చూస్తూ కూర్చున్నాడు.

ఇంతలో వీధిగేటు తీసుకుని ఓ మనిషి లోపలికి వచ్చాడు. 'బాబూ, అమర్ బాబట, ఎవురూ? ఆ యమ్మ రిక్షాలో కూర్చున్నాది. పిలుస్తున్నాది' అన్నాడు.

అమర్ ఆశ్చర్యంగా లేచి నిలబడి, ఓసారి తండ్రికేసి చూసి త్వరత్వరగా వీధివైపు నడిచాడు. నూర్ రిక్షా నానుకుని నిలబడివుంది, చేతిలో చిన్న పెట్టెతో.

'నూర్!' అమర్ నమ్మలేనట్లుగా పిలుస్తూ దగ్గరికి వచ్చాడు.

'ఏంజరిగింది?' ఆత్రుతగా ప్రశ్నించాడు.

'అమర్ నేనువచ్చేశాను,' అంది మెల్లగా నూర్ అమర్‌కి అర్థంకాలేదు.

ఇంత హఠాత్తుగా నూర్ వచ్చేసిన కారణమేమిటి? అమర్‌కి నూర్‌ని అలా నిలబెట్టి, రిక్షావాడి ఎదురుగా మాట్లాడటం ఇష్టంలేదు. ఓ క్షణం నూర్‌ని ఇంటిలోకి తీసుకువెడదామా అన్న ఆలోచనని మార్చుకుని, రిక్షావాడిని పంపేసి నూర్ చెయ్యిపుచ్చుకుని వీధి చివరవైపుగా నడువసాగాడు ఆ వీధి చివరగా ఓ రావిచెట్టుచుట్టూకట్టిన అరుగువుంది. అమర్ ఆ రాతిఅరుగుమీద నూర్ పక్కగా కూర్చుని ఆమె చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు. ఈ హఠాత్సంఘటనతో అతనికి బుద్ధి దిమ్మెరపోయినట్లయింది. ఏంచెయ్యాలో పాలుపోనట్లు మౌనంగా కూర్చున్నాడు.

అమర్ మౌనం గమనించిన నూర్ లక్ష సందేహాలతో 'అమర్' అంది భయంగా అతని చెయ్యి పుచ్చుకుని. ఆ పిలుపుకి అమర్ బుద్ధి పనిచెయ్యసాగింది. ఎవరికీ ఇష్టంలేని తమ వివాహం-పూర్తిగాని తన చదువు - హఠాత్తుగా వచ్చేసిన నూర్-ఈ రాత్రివేళ ఒంటరి ఆడపిల్లని ఎక్కడ వుంచాలా అన్న ఆందోళన...ఒక్క మూడునెల్లు...కనీసం ఒక్క పదిరోజులు తన అన్నగారి దగ్గర్నుంచి జవాబు వచ్చేవరకు ఇలా జరక్కపోతే-ఇన్ని ఆందోళనలమధ్య సతమతమవుతున్న అతనికి ఒకే ఒక్క విషయం ఎనలేని శక్తిని ఇస్తోంది. తనమీది నమ్మకంతో సర్వస్వాన్ని విడిచి వచ్చేసింది నూర్ తనకోసం...ఈ ఆలోచనే అతనికి ఎక్కడలేని శక్తిని, ధైర్యాన్ని కలిగిస్తోంది. అభయమిస్తున్నట్టుగా నూర్ చేతిమీద తన చేతిని వేశాడు.

***With best Compliments***

***from***

COATES OF INDIA LIMITED

Printing Ink Manufacturers

MADRAS

'నూర్, నా ఫ్రెండుకి మన సంగతి అంతా చెపుతాను. అతని రూంలో రేపటివరకు వుంటే మనం ఏదో ఒకటి నిర్ణయిద్దాం,' అన్నాడు చివరికి.

నూర్ భయంగా అతని చేతిని గట్టిగా పట్టుకుంది.

'వద్దు. వద్దు అమర్. మనం ఈ ఊళ్లో ఒక్క క్షణం కూడా వుండవద్దు. మా బాబా సంగతి నీకు తెలియదు. నిన్నుగానీ, నన్నుగానీ చంపించేస్తారు,' అంది మెల్లగా భయంతో.

అమర్ నవ్వాడు. నూర్ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ 'పిచ్చిదానా, మనుషుల్ని చంపటం అంత తేలికగా వుందనుకుంటున్నావా ?' అన్నాడు తేలిగ్గా.

'నీకు తెలియదు అమర్' బాబా సంగతి. నేనంటే ఆయనకి పంచప్రాణాలు. ఆయన నన్నింత నిర్దాక్షిణ్యంగా ఇంట్లోంచి వెళ్ళకొట్టగలిగారు. ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా నడిచేవారిని ఏంచెయ్యటానికయినా వెనకాడరు. మనం ఈ వూళ్లో ఒక్క క్షణం వుండవద్దు.'

'మరి ఏంచేద్దామంటావు?' అమర్ తన ఆలోచనని అప్రయత్నంగా పైకి అనేశాడు.

నూర్ ఓ క్షణం తరువాత అంది.'పాట్నాలో మీ అన్నగారు వున్నారన్నావుగా? ఆయనదగ్గరికి వెడదాం,' అంది మెల్లగా.

అమర్‌కికూడా ప్రస్తుతం అదొక్కటే మార్గంగా తోచింది. 'మరో గంటలో రైలువుంది. నేను బట్టలూ అవీ సర్దుకు వస్తాను,' అన్నాడు.

నూర్ అమర్ వెనకాలే పెట్టె చేత్తోపుచ్చుకొని నిలబడింది. ఇద్దరూ ఇంటి ముందుకి రాగానే ఆగిపోయారు.

'అమర్ నా దగ్గర ఆరువందలవరకు డబ్బు వుంది. నా నగలుకూడా కొన్ని వున్నాయి.' అమర్ డబ్బుకోసం ఇబ్బంది పడతాడేమోనని నూర్ మెల్లగా చెప్పింది.

నూర్ గేటుబయటే నిలబడిపోయింది. అమర్ చకచకా ఇంట్లోకివెళ్ళి లెదర్ సూట్‌కేసులో తన బట్టలన్నీ సర్దుకున్నాడు.పూజామందిరంలోకి వెళ్లి ఒక్క క్షణం శ్రద్ధగా భగవంతుడికి నమస్కరించాడు. సూట్‌కేసు చేతితో పుచ్చుకుని బయటకి వచ్చాడు.

శాస్త్రిగారు అమర్ బయటకి వెళ్ళినపుడు ఎలా కూర్చుని వున్నారో ఇప్పుడూ అదేస్థితిలో వున్నారు. మౌనంగా తపోముద్రలోనున్న యోగీశ్వరునిలా.

అమర్ తండ్రికి ఎదురుగా నిలబడి, 'నాన్నా' అంటూ పిల్చాడు. శాస్త్రిగారు తపోభంగమయినట్లుగా కళ్లు తెరిచి చూశారు.

'నేను వెడుతున్నాను నాన్నా,' అన్నాడు మెల్లగా



పూర్వాపరాలేవీ వివరించి చెప్పకుండా. ఆయన ఏమయినా అడిగితే జరిగింది చెబుదామని అమర్ అనుకున్నాడు.

కానీ ఆయన అడగలేదు. అమర్ చెప్పలేదు. ఆయన అమర్‌ని, అతని చేతిలోని పెట్టెని చూశారు.

'ఓ క్షణం ఆగు,' అంటూ లేచి ఇంటిలోపలికి వెళ్ళాడు. చేతిలో మడిచిన నోట్లకట్టపుచ్చుకుని తిరిగివచ్చారు. అమర్ చేతికి అందిస్తూ 'వుంచు, అవసరం వస్తుంది' అన్నారు.

అంతకుమించి అమర్‌కి చెప్పవలసిందిగానీ,అడిగి తెలుసుకోవలసిందిగానీ ఏమీలేనట్టు తిరిగి కుర్చీలో కూర్చుని భగద్గీతని చేతిలోకి తీసుకున్నారు.

అమర్‌కి కళ్లనిండుగా నీరు తిరిగింది. గొంతుమాట రానట్టుగా బరువుగా అయింది.

'నూర్ బయటవుంది నాన్నా. మమ్మల్ని ఒక్కసారి ఆశీర్వదించండి,' గొంతు పెగుల్చుకుని ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

శాస్త్రిగారి పెదవులమీద బాధామిశ్రితమయిన చిరునవ్వొకటి కదిలింది. 'అమర్! నువ్వెక్కడున్నా నీ శుభాని కంటే మాకు కావల్సింది ఏముంటుందిరా? వెళ్ళిరా. ఆ పిల్లని అన్యాయం చెయ్యకు.'

ఆయన తిరిగి మౌనసమాధిలో మునిగినట్టుగా కళ్ళు మూసుకున్నారు. ఆ మనసులో ఏంజరుగుతోందో బ్రహ్మరుద్రుడికికూడా తెలియదు. అమర్ చకచకా అడుగులేస్తూ గేటుదాటి చీకటిలో నుంచున్న నూర్‌చెయ్యి అందుకున్నాడు

* * *

తన గమ్యంవైపు వేగంగా పరుగెడుతున్న ఆ రైలుబండిలో కూర్చున్న నూర్, అమర్‌ల ముఖాలమీద కొద్దిగంటల క్రితం ఆప్తులని, అయినవాళ్లనీ, అందరినీ శాశ్వతంగా విడిచివచ్చేశామన్న విషాదంగానీ, దిగులుగానీ లేవు. తామింక ఒకరికొకరు అన్నట్లుగా ఒకరినానుకుని మరొకరు కూర్చున్న ఆ ఇరువురిలోనూ ఏదో నూతనోత్సాహం, ధైర్యం, సంతోషం, మరేదో సాధించాలన్న ఆరాటం.

'నూర్ నువు ఇంత సాహసం ఎలా చెయ్యగలిగావు?' అమర్ సంభ్రమంతో నూర్‌ని చూస్తూ మెల్లగా అడిగాడు. అత నిలా అడగటం ఏ పదోసారో అయుంటుంది.

నూర్ చిరునవ్వుతో అమర్‌వైపు చూసింది. 'అమర్ నీ కోసం ఏదయినా చేస్తాను.' అతిమధురంగా పలికింది.

అమర్ ఆ అందమయిన కళ్లలోని ఆరాధనకి, ప్రేమకి, నమ్మకానికి చలించిపోయాడు. తన రెండు చేతులమధ్యనున్న నూర్ మృదువయిన చేతిని పెదవులతో అతి సున్నితంగా స్పృశించాడు. నూర్ సిగ్గుపడి కళ్ళతో పక్క


Phone : 74386
Resi : 74383

Grams : 'FANCY PAPER'
Secunderabad

*Withe best Compliments from :*

**GOLI ESWARIAH**

Dealers : Papers, Boards and Printing Materials.

General Bazar, SECUNDERABAD-A. P.

ప్రయాణికులు చూస్తున్నారన్నట్టుగా సూచించింది. అమర్ కొంటెగా నవ్వి ఆ చేతిని వదిలేశాడు.

రైలు కొండల్ని, మిట్టల్ని, గుట్టల్ని, పల్లెల్ని, పట్నాల్నీ దాటుకుపోతూ తన ప్రయాణాన్ని సాగిస్తోంది. అమర్, నూర్ మరో బండి మారి పాట్నా పోయే రైల్లో ఎక్కారు.

క్రిందటి రోజుకి, ఆ రోజుకి మధ్య క్షణాల్లో జరిగిపోయిన మార్పు విచిత్రంగా వుంది అమర్‌కి. అతని మనుసు ముందు జరగబోయేదాన్ని వూహిస్తోంది. పాట్నాలో తన అన్న గారు ఏం సలహా చెబుతాడో, తనకి వెంటనే ఎక్కడయినా వుద్యోగం దొరుకుతుందో, లేదో! నూర్‌తో తన వివాహం- అతని మనసు ఎక్కడెక్కడో ఆలోచిస్తోంది.

కిటికీలోంచి పరుగెత్తుకుపోతున్న పొలాలని, చెట్లనీ చూస్తున్న నూర్ చటుక్కున ఇటు తిరిగి 'అమర్' అంది మెల్లగా.

'పాట్నాలో మీ అన్నగారిద్వారా ఏదయినా ఉద్యోగం దొరుకుంతుంది గదూ?' అమర్‌కి నవ్వొచ్చింది ఇద్దరి ఆలోచనలూ ఒకేరీతిగా సాగుతున్నందుకు.

'అవును. వెంటనే ప్రయత్నం చెయ్యాలి'.

'చూడు అమర్ కొన్నిరోజులు నేనుకూడా ఎక్కడయినా ఉద్యోగం చేస్తాను. దొరికితేనే అనుకో. కనీసం ఎవరయినా పిల్లలకి ట్యూషన్ చెప్పినా సరిపోతుంది గదూ? అలా అయితే మొదట్లో నీకు అంత కష్టంగా వుండదు. ఏమంటావు?'

అమర్ నూర్‌ని చిరునవ్వుతో గమనిస్తూ, మంత్రబద్ధుడి లాగా ఆమె మాటలని వింటున్నాడు.

'అమర్! చిన్నగది ఒకటి తీసుకుంటే సరిపోతుందిగదూ? పాపం మీ అన్నగారింట్లో మాత్రం ఎన్నిరోజులని వుంటాం?'

'అమర్! మనం రిజిష్టర్ మేరేజ్ చేసుకోవటానికి ఏమీ అభ్యంతరం వుండదు గదూ? వాళ్ళుకూడా ఆ మతం ఈ మతం అంటూ పేచీ పెట్టరుకదా?'.

అమర్ నాకు వంట బాగారాదు. కొన్నిరోజులు నువు ఉపవాసాలు చెయ్యాల్సొస్తుంది.'

అమర్ పకపకా నవ్వాడు. 'నూర్, నువు పక్కా ఇల్లాలు వైపోయావు.' అన్నాడు ఆమెవైపు వంగి మెల్లగా.

నూర్ ఆలోచనలు, పథకాలు చూసి అమర్‌కి నవ్వొస్తోంది. గర్వంగా అనిపిస్తోంది. ఇలా అమయాకంగా పసి పిల్లల్లాగా హాయిగా, స్వేచ్ఛగా తిరిగే ఆడపిల్లలు క్షణాల్లో ఎంతగా ఎదిగిపోతారో అమర్‌కి ఆశ్చర్యంగానూ ముచ్చట గానూ వుంది. నూర్ అలా పక్కగా కూర్చుని, తనతో ఆ విషయం, ఈ విషయం మాట్లాడుతూ వుంటే అమర్‌కి ఎంతో హాయిగా, శాంతిగా, తమ ఈ అనురాగం జన్మ జన్మల అనుబంధంలాగా అనిపిస్తోంది.

*With best Compliments from*

**KAMAT GROUP OF HOTELS**

**HYDERABAD**

నూర్, నువు ఇవన్నీ ఆలోచించి బుర్ర పాడుచేసుకోకు. నేను వున్నానుకదూ? అన్నీ సరిచేస్తాను. నిశ్చింతగావుండు. అమర్ ఆమెకి భరోసా ఇస్తున్నట్టుగా ఆమె బుజాలవెనుగ్గా చేయివేసి లాలనగా అన్నాడు.

నూర్ తృప్తినిండిన కళ్లతో అతనివైపు చూసింది. ఆ నిశ్చింతలో కాసేపు బయటికి చూస్తూ కూర్చుంది. మరుక్షణం మరో ఆలోచన వచ్చేది.

'అమర్' అంటూ ఏదో చెప్పబోయి చటుక్కున ఆగిపోయింది. సిగ్గుతో వంచుకున్న తల, ఎర్రబడిన బుగ్గలు చూసి అమర్‌కి ఆ విషయం ఏమిటో తెలుసుకోవాలని మరీ పట్టుదలగా అడిగాడు.

'ఏంలేదు బాబూ. చంపకు,' కోపంగా నటిస్తూ నవ్వు దాచుకుంది.

'పోనీ ఎవరూ వినకుండా మెల్లగా చెప్పు,' రహస్యం వినబోతున్నవాడిలా అమర్ అమె ముఖం దగ్గరగా వంగి చెప్పు, అన్నాడు.

'అమర్, మరి ముందు ముందు ఎప్పుడయినా మన పిల్లలు, మనం ఇలా వచ్చేసిన సంగతి తెలిస్తే ఏమంటారు?' నూర్ అదో పెద్ద సమస్యలాగా చెప్పింది. అమర్ ఆమె ముఖంలోకి చూస్తూ పకపకా నవ్వాడు.

నూర్ కోపంతోనూ, సిగ్గుతోనూ మొహం ముడుచుకుంది. 'అందుకే నేను చెప్పనన్నాను. నీకన్నీ నవ్వులాటే?'

'ఏమనుకుంటారో చెప్పనా! మా మమ్మీ, డాడీ ఎంత ఎడ్వంచరస్ పీపుల్ అంటూ ఆశ్చర్యపోతారు. లేకపోతే మా మమ్మీకి, డాడీ అంటే ఎంత ఎంత ప్రేమో అని నవ్వుకుంటారు. అవునా?' అమర్ మెల్లగా ఆమె చెవిదగ్గర గుసగుసలాడాడు.

నూర్ సిగ్గుతో, సంతోషంతో పులకించిపోయింది. అమర్‌వైపు చూస్తూ, 'చాల్లే కవిత్వం' అంది ముద్దుగా.

'నూర్, నువ్వలా చూస్తూంటే ఏంచెయ్యాలనిపిస్తోందో తెలుసా?'

'చాల్లే బాబూ, అంతా మన్నే చూస్తున్నారు. సరిగా కూచో' నవ్వుతూ నూర్ కిటికీవైపు తిరిగిపోయి కూర్చుంది.

నూర్ కిటికీకి చేరబడి బయట పరుగులెత్తే ప్రకృతిని గమనిస్తూ ఆలోచనల్లో తేలిపోతుంటే అమర్ ఆ మధురమయిన వూహాలేమిటో తెలుసుకుంటే ఎంత బాగుండును అనుకుంటూ తన్మయంగా నూర్‌వైపే చూస్తూ గాలికి ఆమె నుదుటిమీద నాట్యంచేసే ముంగురుల్ని చూస్తూ కూర్చునేవాడు.


*Hearty Diwali Greetings from*

# VENKATESH PAPER MART

WHOLESALE DEALERS IN PAPER & BOARDS
OF ALL VARIETIES ON MOST COMPETITIVE RATES

**4-6-546, Esamiah Bazar, Hyderabad-500027.**

Phone : 5 1 8 2 8

అమర్‌కి చటుక్కున నూర్‌ని ఏడిపించాలన్న ఆలోచన వచ్చింది. 'నూర్, నేను ఇలా నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయాననుకో. ఏంచేస్తావు?' కొంటెగా అడిగాడు.

నూర్ అదిరిపడింది. ఉలిక్కిపడి అమర్ వైపు తిరిగింది. ఆ సుందరనేత్రాలు కన్నీటితో నిండి మరింత ముగ్ధంగా మెరిశాయి. అమర్ వైపు చూస్తూ మెల్లగా అంది.

'బహుశా చచ్చిపోతాను. లేకపోతే పిచ్చిదాన్నవుతాను.'

అమర్ ఆ కంఠధ్వనికి ఆ ముఖంలో కదిలిన భావాల్ని చూసి చలించిపోయాడు. అనవసరంగా నూర్‌ని బాధపెట్టినందుకు తన్ను తనే నిందించుకుంటూ అనునయంగా ఆమె భుజాలచుట్టూ చేతినివేసి, 'పిచ్చి, నేను వూరికే అన్నాను. అంత బాధపడిపోతావేం?' అన్నాడు మెల్లగా.

నూర్ బుగ్గలమీదుగా కన్నీరు జారిపోయింది. అమర్ వైపు బేలగా చూసింది. 'అమర్, నిజంగా నన్నెప్పుడూ విడిచిపెట్టవుగదూ?'

అమర్‌కి కన్నీరు పొంగుకొచ్చింది. తన చేతిని ఆమె చుట్టూ మరింత గట్టిగా చుట్టి నూర్ మెడవంపులో తన మొహాన్ని దాచుకున్నాడు.

'నూర్, నువు లేనిక్షణం నే నేమయిపోతానో నూర్! నా కెప్పుడూ దూరంగా వుండకు.' ఆమె భుజంమీద తన మొహాన్ని రుద్దుతూ మెల్లగా, బాధగా పలికాడు. నూర్ నాగస్వరం విన్న నాగినిలా పరవశించిపోయింది, అతని చేతుల్లో.

ఎదురు బెంచీమీద కూర్చున్న ఓ తాతగారు కొంటెగా దగ్గటంతో ఇద్దరూ సిగ్గుపడి దూరంగా జరిగి కూర్చున్నారు.

నూర్ మౌనంగా, గంభీరంగా బయటికి చూస్తూ కూర్చుంది.

'నూర్, నీకు గులాబీలంటే చాలా ఇష్టంకదూ! మన ఇంటిముందర అన్నీ గులాబీలే వేద్దామా?' అమర్ ఆమెని సలహా అడిగాడు. అమర్ ఆశించినట్టుగానే నూర్ మొహం ప్రసన్నంగా మారింది. తల తిప్పి అతనివైపు చూసింది.

'చిన్న ముచ్చటయిన ఇల్లు. ఇంటిముందు అందంగా విరగబూసిన గులాబీల తోట. నాకోసం ఎదురుచూస్తూ అందాల బొమ్మలాగా నిలబడిన నా నూర్. అల్లంత దూరం నుంచే ఎదురొచ్చే నా నూర్; నూర్ చిరునవ్వులో నేను ఈ ప్రపంచాన్ని, చివరికి నన్ను నేనే మర్చిపోతానట! ఆ పిల్ల గుండెల్లో కరిగిపోతానట. ఆమె సిగపువ్వునయిపోతానట. ఆ సుందరి బుగ్గలమీది సిగ్గునయిపోతానట! ఆమె పెదవులమీది చిరునవ్వునయిపోతానట. ఆ కళ్ళలోని కంటిపాపనయిపోతానట. అవునా?'


*With best compliments from*

**SRI METAL INDUSTRIES**

**Manufacturers of : Precision Press Parts, Sheet Metal Products for Electronic Industries.**

**Fabricators of : Medium, Heavy Engineering and Chemical Equipment and Erectors of Cranes.**

*Works :*
7-1-215/8, Ameerpet,
Hyderabad-500016.
Phone : 38112 PP

*Office :*
8-3-1027, Srinagar Colony,
Hyderabad-500038.
Phone : 35559

నూర్ తన్మయంగా కళ్ళుమూసుకుని మధురంగా వినవస్తున్న అమర్ మాటలని కళ్ళముందు చిత్రించుకుంటోంది.

'మరోరోజు నా నూర్‌కంటె ముందుగా మరో బోసినోటి బాబు తడబడే అడుగులతో చేతులు జాచి 'డాడీ' అంటూ మమ్మీకంటె ముందుగా పరుగుపెట్టి వస్తాడట. వాడిని నేను ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటే వాడి మమ్మీకి కోపంట. ఎందుకో తెలుసా నూర్ ?'

నూర్ మెల్లగా కళ్లు తెరచి అమర్‌వైపు చూసింది చిరునవ్వుతో. ఆ కళ్ళు సిగ్గుతో బరువుగా వాలిపోతున్నాయి.

'ఎందుకంటే మమ్మీని ముద్దు చెయ్యకుండా బాబుని ముద్దుపెట్టుకున్నానని.'

నూర్ తన మొహంలోని భావాల్ని ఎవరూ గమనించటం ఇష్టంలేనట్టుగా చటుక్కున మొహం తిప్పుకుని నవ్వుని దాచుకుంది పెదవులమధ్య.

'వాడు అల్లరిగా పాలన్నీ ఇల్లంతా వంపేసి పరుగుపెట్టిపోతే వాడిని అందుకోలేక నా నూర్ అలిసిపోయి కోపంతో 'ఇదుగో అమర్. నీ కొడుకు అల్లరిని నేనింక భరించలేను. నీకేమయినా ముద్దుగా వుందేమో. అలా నవ్వకు. నాకు వొళ్లు మండిపోతోంది. వాడిని లాక్కొచ్చి నాలుగు తన్ను వెధవని' అంటుందట నా నూర్.

'వాడు చదవటానికి మారంచేస్తే నా నూర్ ఏమంటుందో తెలుసా! ఇదుగో అమర్, వీడికి చదువు రాదు. వట్టి మొద్దబ్బాయి. అచ్చు తండ్రిపోలిక, అంటుందట, కొంటెగా నవ్వుతూ. అంతలోనే అబ్బాయి మొద్దుతనాన్ని మర్చిపోతూ 'అమర్ బాబుని డాక్టర్ చదివిద్దామా? లేకపోతే ఇంజనీరింగా?' అంటుందట కలల్లో తేలిపోతూ.

చీకటిలో మెరిసే నక్షత్రాలకేసి చూస్తూ, మెలమెల్లగా పైకి పాకుతున్న నెలవంకని చూస్తూ కిటికీమీద తలవాల్చి అమర్ కొంటెతనాన్ని ఊహల్లో చిత్రించుకుంటోంది తన్మయంగా.

'మా బాబు పుట్టిన తరువాత మాకు వంటరి సమయాలే కరువయిపోయినాయట. అబ్బ వొదులు అమర్, బాబు చూస్తున్నాడు.' 'అంటూ అయిష్టంగానే పారిపోతుందట నా నూర్ అంతలోనే 'ఇదుగో అమర్, వీడితోనే నీకు లోకం అయిపోయింది. నన్ను మర్చిపోయావు' అంటూ గారాలు పోతుందట పెంకెగా.

బయట ప్రపంచాన్ని పల్చగా చుట్టిన వెన్నెలని చూస్తూ నూర్ తన మనోనేత్రంలో అమర్ వూహలకి రూపు దిద్దుతోంది. ముచ్చటయిన చిన్న ఇంట్లో తను, అమర్; చకోర పక్షిలా అమర్ రాకకి ఎదురుచూసే తను, అమర్

*With best compliments from*

**DOLTON PRESS**

Quality Printers & Block Makers

**5-9-88 Public Garden Road**

**HYDERABAD - 500 001**

**Phone : 3 4 4 0 0 Grams : 'DOLTONS'**

చిరునవ్వులో కరిగి, అతని బాహువుల్లో ఇమిడి, ఆ కొంటె తనంలో పరవశించిపోయే తను, ఆ చిన్న ఇంట్లో మహా రాణిలా తిరిగే తను, అమర్‌ని లాలిస్తూ, కోపగించుకుంటూ, ఆజ్ఞాపిస్తూ, విసుక్కుంటూ, అతని కోపాన్ని తీరుస్తూ, అతనిపిల్లల తల్లిగా—నూర్ కళ్లురెండూమూసి ఆ సర్వాంత ర్యామికి నమస్కరించింది. 'భగవాన్ నా జీవితంలోని ఆఖరి క్షణంవరకు నాకు అమర్ సాహచర్యాన్ని ప్రసాదించు. అతని వడిలో నిశ్చింతగా కళ్ళు మూసే వరాన్ని అనుగ్రహించు. అంతకు మించి నిన్నేమీ కోరను తండ్రీ: నాకీ ఒక్క వరాన్ని ప్రసాదించు భగవాన్.'

'నూర్ నా మాటలు వింటున్నావా? కాకపోతే కళ్లుమూసి కలలుకంటున్నావా?' అమర్ వంగి మెల్లగా అడిగాడు.

నూర్ కళ్లు తెరిచి మధురంగా నవ్వింది. అతని చేతిని తన రెండుచేతుల్లోకి తీసుకుని మెల్లగా అంది. 'రెండూ చేస్తున్నాను.'

అమర్ చేతిని గాఢంగా, ప్రేమగా తన బుగ్గలకి ఆనించుకుంది. అమర్ అతిసున్నితంగా ఆమె చెక్కిళ్లని చేతితోరాస్తూ 'నూర్' అన్నాడు. అతిమెల్లగా భాషకందని భావాలతో పలికినపిలుపుకు నూర్‌లోని అణువణువుపులకించి, పల్లవించింది. నూర్ చిన్నగా వణికే చేతులతో అతని రెండు చేతుల్లోనూ తన మొహాన్ని దాచుకుంది. ఆమె పెదవులు అతిసున్నితంగా, రహస్యంగా జపిస్తున్న 'అమర్' అన్న పిలుపు అతనికి వినపడకపోయినా అమర్‌కి తెలుస్తూనే వుంది.

'నూర్, మరో పది గంటల్లో పాట్నా జేరిపోతాము. ఆమె నించి తనచేతుల్ని విడతీసుకుని సరిగా కూర్చుంటూ అన్నాడు.

నూర్ కలలోంచి మేల్కొన్న దానికిమల్లే లేచి సరిగా కూర్చుంది.

'బహుశా అన్నయ్య స్టేషన్‌కి వస్తాడు, నేనిచ్చిన టెలిగ్రాం అందితే.

నూర్ మౌనంగా అమర్ భుజంమీద తలవాల్చి బయటి వెన్నెలలో పరుగుపెడుతున్న ప్రకృతిని గమనిస్తూ అలాగే నిద్రలోకి జారిపోయింది.

అమర్‌కకూడా చల్లగాలికి, రైలు కుదుపుకి, మెల్లమెల్లగా కళ్లు మూతలుపడుతున్నాయి. మరి కాసేపటికి అలాగే నిద్రలోకి జారిపోయాడు.

* * *

చటుక్కున అమర్‌కి మెలకువ వచ్చింది. అమర్ అప్రయత్నంగా చేతివైపు చూశాడు టైముకోసం. అర్ధ


బ్లాక్ మేకింగ్‌కు మరోపేరుగా సుపరిచితమైన

సత్యం ప్రాసెస్

ఇప్పుడు అదనంగా

కలర్ ప్రింటింగ్

విభాగం కూడ ప్రారంభించింది

డ్రాయింగ్ నుండి కలర్ ప్రింటింగ్ వరకూ

ఒకేచోట పూర్తిచేసుకునేందుకు

సంప్రదించండి :

PRISM OF PEERLESS QUALITY

సత్యం ప్రాసెస్

లకిడికాపూల్, పోలీస్‌స్టేషన్ ఎదురుగా

హైదరాబాద్ - 500 004

ఫోన్ నెం. 33970

రాత్రి రెండుగంటలయింది. ఆ రైలుపెట్టెలోని అందరూ ఒకళ్ళ మీదకి మరొకళ్ళు వొరిగి వివిధావస్థలలో నిద్రాదేవి వడిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. నూర్ అతని భుజం మీద తలవాల్చి నిద్రపోతోంది. చటుక్కున అమర్ దృష్టి ఎదుటి సీటుకింద వాలి ఆగిపోయింది. తన లెదర్ సూట్ కేస్ వుండవలసిన స్థానం ఖాళీగా వుంది. అమర్ మెల్లిగా నూర్ తలని తప్పించి, ఆత్రుతగా ముందుకి వంగి ఎదుటిసీటుకింద నాలుగువైపులా పరీక్షగా చూశాడు. ఎక్కడా అతని లెదర్ కేస్ కనపడలేదు.

అమర్ గుండెలు ఒక్కక్షణం దడదడలాడినాయి. తన దగ్గరవున్న డబ్బు, టిక్కెట్లు,తన బట్టలు అన్నీ ఆపెట్టెలోనే వున్నాయి. అమర్ ఒక్క వుదుటున లేచి నిలబడి పైబెర్తుల మీద చూడసాగాడు. పొరపాటున తను అక్కడగానీ తన పెట్టెని వుంచానేమోనని. పైబెర్తుమీద వెతుకుతుండగా అతని దృష్టి అప్రయత్నంగా తలుపుదగ్గర నిలబడిన ఓ వ్యక్తి మీద పడింది. బలమయిన మనిషి. చేతిలో లెదర్ సూట్ కేస్. తనదే. రైలు మలుపు తిరుగుతున్నట్లుంది. వేగం తగ్గింది. అతను కదిలే రైల్లోంచి దిగిపోయే ప్రయత్నంలో వున్నట్లుగా ముందుకి వొంగి వున్నాడు.

అమర్ నిశ్శబ్దంగా ఒక్క అంగలో వెనగ్గా వెళ్ళి తలుపు కమ్మీలు పట్టుకునిలబడిన ఆ వ్యక్తిని షర్టు పుచ్చుకుని వెనక్కి ఒక్క లాగులాగాడు.ఆ వ్యక్తి ఈ హఠాత్సంఘటనకి ఎదురు చూడకపోవటంలో తూలి, అమర్ మీద పడ్డాడు. వెనకకి. అమర్ ఒక్కక్షణంలో అతని చేతిలోని సూట్ కేసు లాక్కొని, బలంగా అతని గడ్డంకింద ఓ గుద్దు గుద్దాడు. ఆ వ్యక్తి ఎదురుచూడని ఈ దాడికి బిత్తరపోయినట్లుగా ఓ క్షణం నిలబడి, మరుక్షణం స్పృహలోకి వచ్చినవానిలాగా చటుక్కున అమర్ రెండుచేతులూ పుచ్చుకుని తెరచివున్న తలుపువైపుగా లాగి బలంకొద్దీ అమర్ పొట్టలో ఓ తన్ను తన్నాడు. అమర్ చేతిలోని పెట్టె ఎగిరి దూరంగా పడింది. తెరచిన తలుపులోంచి బంతిలాగా ఎగిరి కిందపడుతూ అమర్ పెట్టిన గావుకేక రైలుకూతలో కలిసిపోయింది. బయట మసక వెన్నెలలో చెట్లూ పుట్టలూ పరుగు పెడుతున్నాయి. మెయిలుబండి జరిగిన సంఘటనతో తనకేమీ సంబంధం లేనట్టుగా కొండలు, గుట్టలు వూళ్ళు నాళ్ళు దాటుకుంటూ సాగిపోతోంది.

* * *

రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది. నూర్ ఒక్కసారిగా వులిక్కిపడి లేచింది. పక్కన అమర్ లేకపోవటం చూసింది. బహుశా అమర్ కిందకి దిగాడో, లావెటరిలోకి వెళ్ళివుంటాడో అనుకుని తిరిగి కిటికీమీద తలవాల్చి కళ్ళు మూసుకుంది. రైలు కూతపెడుతూ తన ప్రయాణాన్ని సాగిస్తోంది. మరో అరగంట గడిచింది. గంట గడిచింది. అమర్ రాలేదు. నూర్ నిద్ర పూర్తిగా ఎగిరిపోయింది. అమర్ ఇంతసేపు ఏమయినట్టు ?

మెల్లగా లేచివెళ్ళి లావెట్రి తలుపులాగి చూసింది. తలుపు తెరుచుకుంది. లోపల ఎవరూలేరు. నూర్ గుండె వడివడిగా కొట్టుకోసాగింది. మనసు ఏదో కీడుని శంకిస్తోంది. పక్క పెట్టెలో ఎవరితోనయినా మాట్లాడుతున్నాడేమోనని అటుగా వెతికి వచ్చింది. అంతా నిద్రలో జోగుతున్నారు. మెలకువ వచ్చిన ఒకళ్ళిద్దరు అనుమానంగా నూర్ వైపు చూశారు. అదిరిపడుతున్న గుండెలతో జీవంలేనట్లుగా వచ్చి తన చోటులో కూర్చుంది నూర్. ఏమయినట్టు అమర్ ? మనసులోకి తరుముకొస్తున్న భయంకరమయిన ఆలోచనలని బలవంతాన నెట్టుతూ అయోమయావస్థలోనున్న నూర్ దృష్టి చటుక్కున ఎదుటి సీటుకింద వాలి, కొయ్యబారినట్లుగా అలాగే చూస్తూ వుండిపోయింది. అమర్ లెదర్ కేసు వుంచిన జాగా ఖాళీగావుంది! పక్కనే తన చిన్న పెట్టె ఒంటరిగావుంది. అనుమానం తీరినట్టుగా మరోసారి కిందకివంగి పరిశీలనగా చూసింది. అమర్ లెదర్ కేస్ ఎక్కడా లేదు,

అమర్ లేడు. అతనితోబాటు అతని పెట్టె కూడా మాయమయింది.అంటే...అంటే...నూర్ కళ్లముందు ఈ ప్రపంచమంతా గిరగిరా తిరుగుతున్నట్టయి, కళ్లుమూతలుబడి, తల వెనక్కి వాలిపోయింది. స్పృహతప్పిపోయిన నూర్ అలా ఎంతసేపువుండిపోయిందో మరి రైలు గీపెడుతూవచ్చి పాట్నా స్టేషన్‌లో ఆగింది.

పక్క ప్రయాణీకులు, తట్టి లేపుతుంటే, నూర్ నీరసంగా కళ్ళుతెరిచి చూసింది.

'స్టేషను వచ్చిందమ్మా, లే,లే. ఇక్కడే దిగుతామన్నారు గదూ మీరు,' అంటూ ఓ పెద్దముత్తయిదువ నూర్‌ని తట్టి లేపింది.

నూర్‌కి ఏదో లోకంలోంచిలాగా ఆమె మాటలు వినబడినాయి. కళ్ళు తెరుచుకుని అర్థరహితంగా ఎటో చూస్తోంది. అమర్ లేడు. తను వంటరిది. అమర్ ఇంత మోసంచేస్తాడా? తన అమర్ తనని విడిచి పెట్టి వెళ్ళిపోయాడా?! లేదు.లేదు ఇదంతా అబద్ధం, మోసం. తన అమర్ తనని ఇలా ఒక్కనాటికీ విడిచిపెట్టి వెళ్లడు. ఈ ప్రపంచమంతా ఏకమయి లక్ష కంఠాలతో అరిచినా ఒక్కనాటికీ తను నమ్మదు. తమ ప్రేమని, అనురాగాన్ని చూడలేని,సహించలేని ఏ దుష్టశక్తో తమని వేరుచేసింది. ఏదో రోజు అమర్ తనని

వెదుకుతూ వస్తాడు. తను కనపడకపోతే పిచ్చివాడయి పోతాడు. తనెక్కడికీ వెళ్లదు. ఇక్కడే అమర్ కోసం ఎదురు చూస్తూ వుంటుంది. తన అమర్ కోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఏదో ఓ క్షణాన తిరిగివచ్చే అమర్ కోసం తను ఇక్కడే ఎదురుచూస్తూ వుంటుంది.తనని దాటిపోకుండా అనుక్షణం వేయికళ్లతో ఎదురుచూస్తూ......

జనం హడావిడిగా దిగిపోతున్నారు. నూర్ మెల్లగా తన పెట్టెని చేతిలోకి తీసుకుని రైలు దిగింది. మెలమెల్లని అడుగులతో జనం బయటికివెళ్ళే దోవదగ్గర నిలబడి తన కోసం వెదుకుతూ వచ్చే అమర్ ని వెదుకుతూ, ఒకొక్కళ్లనే పరీక్షగా చూడసాగింది. క్షణం కనుమరుగవకుండా,ఆ స్థలం విడిచి వెళ్లకుండా, ఏమరుపాటు లేకుండా అనుక్షణం అమర్ కోసం ఎదురుచూస్తోంది. అలా పద్దెనిమిది సంవత్సరాలుగా ఎదురుచూ స్తూనే వుంది.

*　　*　　*

హాస్పటల్లో కన్ను తెరచిన రోజున అమర్ కి అది ఏ నెలో, ఏ రోజో, ఎన్నోతారీకో తెలియదు.విరిగిన కాలికి ప్లాస్టర్ తో, ముఖమంతా ఒక్క కన్ను మినహాగా తెల్లని బ్యాండేజీలతో భయంకరంగా వున్నాడు.

అడవిలో కట్టెలు కొట్టుకోవటానికి వెళ్ళిన పల్లెరైతు, రైలుకట్ట పక్కగా పల్లంలోని ముళ్లతుప్పల్లో రక్తం ముద్దలా పడివున్న అమర్ ని, మరో నలుగురి సాయంతో పక్క వూరిలోని హాస్పటల్లో చేర్పించాడు.అమర్ కి స్పృహవచ్చేంత వరకు వారంరోజులుగా అతని పక్కనే కనిపెట్టుకుని కూర్చున్న ఆ పల్లెవాడు, అమర్ బాధతో మూలిగినప్పుడు ఆనందంతో రెండుచేతులూ ఎత్తి భగవంతుడికి నమస్కరించాడు. అన్ని భయంకరమయిన గాయాలతో అమర్ బ్రతికి బయటపడటమే వింతల్లో వింత అని డాక్టర్లు చెప్పినప్పుడు ఆ పల్లెరైతు కళ్ళనీళ్లు తెచ్చుకుని మరోసారి భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

అమర్ మరో నెలరోజులకిగాని నోరుకదిపి మాట్లాడలేక పోయాడు. మరో మూడు నెల్లకిగానీ గాజుకంటికి అలవాటు పడలేకపోయాడు. నాలుగు నెలల తరువాత అమర్ తన ఆకారాన్ని అద్దంలో చూసుకుని కెవ్వుమని కేక వేసి, 'భగవంతుడా నన్నెందుకు బతికించావు?' అని కుళ్ళికుళ్ళి ఏడిచాడు.

అమర్ కి హాస్పటల్లో మొదట తెలివిరాగానే పాట్నాలోని అన్నగారి ఎడ్రసుకి టెలిగ్రాం ఇప్పించాడు. ఆయన పరుగు పెడుతూ తమ్ముడిని చూడటానికివచ్చి, అమర్ దురవస్థకి బాధపడ్డాడు. అమర్ తదేకంగా ఆయనవైపే చూడసాగాడు; 'నూర్ క్షేమంగా నా దగ్గిరకి చేరింది,' అన్న చల్లటి ఖబురు చెబుతాడేమోనని. కానీ ఆయన ఆ విషయమే ప్రస్తావించ లేదు.

'నువ్వు ఇచ్చిన టెలిగ్రాం అందింది. మిమ్మల్ని కలుసుకుందామని స్టేషనుకి వచ్చాను. ఎక్కడా నువు కనబడలేదు. సరే ప్రయాణం మానుకున్నావేమో ననుకుని తిరిగి వెళ్ళిపోయాను.' అన్నాడాయన.

అమర్ అతికష్టంమీద ఎడమచేతితో పేపరుమీద 'నూర్ ఏమయింది ? నీ దగ్గరికి రాలేదా?' అన్న రెండు వాక్యాలు వంకరటింకర అక్షరాలలో రాసి అన్నగారికి చూపించాడు.

ఆయన రెండు క్షణాలు ఆలోచించి, 'ఆ అమ్మాయి నా దగ్గరకి రాలేదే! అసలు ఆ పిల్లకి నా ఎడ్రసు తెలుసా?' అన్నాడాయన సందిగ్ధంగా.అమర్ కి అప్పటికిగానీ యదార్థం గుర్తుకురాలేదు. నూర్ కి తన అన్నగారి అడ్రసు తెలియదని. తెలిసినా వెళ్ళే స్థితిలో లేదని అమర్ కి ఆ క్షణాల్లో తెలియదు. అతను బాధగా కళ్ళు మూసుకున్నాడు. మరో నెలరోజుల తరువాతగానీ అమర్ నోరువిప్పి జరిగిన సంఘటన యేమిటో చెప్పలేకపోయాడు. అమర్ అన్నగారు శాస్త్రిగారికి జరిగిన సంఘటన వివరిస్తూ వుత్తరం రాశాడు. కానీ అమర్ తండ్రికి బదులుగా ఆయన వ్రాసిన జాబు వచ్చింది.

'అమర్ ని ఆ స్థితిలో చూడగల ధైర్యం నాకు లేదనుకుంటాను. అమర్ తను నమ్మిన నిజాన్ని ఎన్ని ఆటంకాలొచ్చినా నెరవేర్చగలడన్న నమ్మకం నాకుంది. ఈ సమయంలో నీకంటె వాడికి ఆప్తులు మరెవ్వరూలేరు. వాడికి కావల్సిందేదో నువే చెయ్యి.' అంటూ శాస్త్రిగారు అమర్ అన్నగారికి జవాబు రాశారు. ఆయన పినతండ్రి కఠినత్వాన్ని మరోసారి నిందిస్తూ, ఆ వుత్తరాన్ని అమర్ కి ఇచ్చాడు.

ఆ వుత్తరంచూసి అమర్ కి కోపం రాలేదు. బాధ కలగలేదు. అందులో తండ్రి తనకేదో సందేశం ఇస్తున్నట్టే కనబడింది. అవును, తన ప్రస్తుత కర్తవ్యం నూర్ ఎక్కడుందో, ఏమయిందో తెలుసుకోవాలి అనుకున్నాడు.

మరో నాలుగు నెలల తరువాత అమర్ తను పుట్టిపెరిగిన వూరికి తిరిగి వచ్చాడు. తన పరిచయస్తులెవరూ గుర్తుపట్టలేని రూపంతో ఖాన్ గారి ఇంటిపనివాడిని నూర్ గురించి అడిగాడు. వాడు ఓసారి అమర్ ని పరికించి చూశాడు. పెరిగిన జుట్టు, గడ్డం, గాజుకన్ను, మొహంమీది వికృతమయిన గాయంమచ్చ, మాసిన బట్టలు చూసి ఎవరో ముష్టివాడు అయ్యుంటాడనుకున్నాడు.

'నీ కేంపనీ ఆ అమ్మాయితో?' అన్నాడు వాడు.

అమర్ ఓ క్షణం తడబడి, 'ఇదివరకు నేను ఇటువైపుగా వచ్చినప్పుడు ఆ అమ్మాయి బిచ్చంవేసేది బాబూ. అందుకు అడుగుతున్నాను,' అన్నాడు, అమర్ కన్నీరు బయట పడకుండా జాగ్రత్తపడుతూ.

వాడు ఓ క్షణం జాలిగా అమర్‌ని చూసి, 'అవును, అసలు ఆ పిల్లగుణమే మా గొప్పది.తండ్రి ఇంట్లోంచి వెళ్ళ కొట్టిన తరువాత ఆ అమ్మాయి జాడే తెలియరాలేదు. తన కూతురు చచ్చిపోయిందని అందరితో చెప్పుకుంటున్నాడు ముసలిముండా కొడుకు,' అన్నాడు వాడు కసిగా.

అమర్‌కి నూర్ తిరిగి ఇక్కడికి వచ్చి వుండదన్న అనుమానం నిజమేనని తేలింది.మరేంచెయ్యాలో తెలియలేదు. తలిదండ్రుల్ని చూడటానికి కూడా మనస్కరించలేదు. నూర్ జాడ ఏమీ తెలియరాలేదంటూ పాట్నానించి అన్న గారు వుత్తరం రాశారు. ఆ రాత్రే అమర్ గమ్యంలేకుండా నూర్ కోసం, తన మనశ్శాంతికోసం దేశాటన ప్రారంభమయింది.దాదాపు పద్దెనిమిది సంవత్సరాల తరువాత ఒకనాడు తను నూర్‌తో కలిసి నూతన జీవితం ప్రారంభించాలని కలలుకన్న ఆ వూరిలో తిరిగి కాలుపెట్టాడు, సాధుబాబాగా.

ఆమె మూసిన కళ్ళనించి అవిరళధారగా కన్నీరు జాలు వారుతోంది. సాధుబాబా చేతిలోని మల్లెదండమీద తుషార బిందువుల్లాగా అతని కన్నీరు రాలుతోంది. మల్లెదండ వాడి పోతోంది, ఆ కన్నీటి వేడికి. అమె మంచానికి జేరబడి అలాగే కూర్చుండిపోయాడు. ఆటుగా వచ్చిన రతన్‌సింగ్ ఇరువురిని మార్చిమార్చి చూశాడు ఆశ్చర్యంగా. పకపకా నవ్వుతూ, 'ఏం భాయ్ మల్లెదండతో మందు వేస్తున్నావా?' అంటూ హాస్యమాడాడు. సాధుబాబా ముఖాన మలిన మందహాస మొకటి మెరిసి మాయమయింది. మౌనంగా తల దించుకుని కూర్చుండిపోయాడు.

* * *

ఆరోజు ఆమె పరిస్థితి మరింత దిగజారింది. ఆయాసంతో ఆమె గుండెలు ఎగిరెగిరిపడుతున్నాయి. పాలిపోయిన మొహంలో క్రమంగా కాంతి క్షీణించిపోతోంది. ఉండుండి ఏదో గొణుక్కుంటున్నట్టుగా పెదవులు కదలుతున్నాయి. బలహీనమయిన ఆమెచేతి గుప్పిటలో నలిగిన రెండు కాగితం ముక్కలని గట్టిగా పట్టుకుంది.

సాధుబాబా మెల్లగా ఆమె తలవైపుగా నిలచి 'నూర్' అంటూ అతిమృదువుగా పిలిచాడు. ఒక్క క్షణం మూసిన ఆమె కనురెప్పలు అల్లల్లాడినాయి. అంతకుమించి మరే చైతన్యమూ లేదు. సాధుబాబా అతిమెల్లగా మూసిన ఆమె గుప్పిటని తెరచి నలిగి పాతబడిన రెండు కాగితం ముక్కలని తీసి సరిచేసి చూశాడు.

కాలంతోపాటు నలిగి పాతబడిన ఆ కాగితాలమీద నాలుగు వాక్యాలు రాసివున్నాయి.

'ఎక్కడ వున్నావు? ఎప్పుడు వస్తావు? నీకోసం చాలా కాలం ఎదురుచూస్తూ గడిపాను.'

ఎదురుచూసిచూసి, అలిసి, వేసారిపోయి తన మనో వ్యధని ఆ కాగితాలమీద రాసుకుంది ఆమె.

సాధుబాబా గుండెలు బరువెక్కి, కన్నీరు బుగ్గలమీదుగా గడ్డంలోకి జారిపోతోంది. అతి ప్రియమయిన, అపురూప మయిన వస్తువుని పట్టుకున్నట్టుగా ఆ కాగితాలని అతి జాగ్రత్తగా తన గుండెల కానించుకుని ఆమె మంచానికి జేరబడి, తదేకంగా ఆమె ముఖాన్ని గమనిస్తూ అలాగే రాతి విగ్రహంలాగా కూర్చుండిపోయాడు.

వచ్చిపోతున్న రైలుబండ్ల కూతలకి ఆమె కనురెప్పలు కదులుతున్నాయి. కానీ శరీరానికి లేచి నడిచేశక్తి నశించింది. ప్రయాణీకుల గేటుదగ్గర ఆమె రోజూ నిలబడి పరిశీలించి చూసే స్థలం ఆరోజు చిన్నబోయింది.

ప్రయాణీకుల హడావిడి తగ్గగానే ముసలితాత ఆమె వైపుగా వచ్చాడు. మంచానికి జేరబడి కూర్చున్న సాధు బాబాని చూశాడు.

'సాధుబాబా, రాత్రినించి ఈ పిల్ల పరిస్థితేం బాగుండ లేదు. చివరిరోజులు దగ్గరపడుతునట్టున్నాయి,' అన్నాడు విచారంగా, వంగి ఆమె నుదుటిని తాకి చూస్తూ.

సాధుబాబా కనులెత్తి తాతవైపు చూశాడు. 'ఏంచేద్దా మంటావు, తాతా?' అన్నాడు మెల్లగా.

'ఏదయినా మందువేస్తే బాగుంటుందేమో,పిచ్చిది ఈచోటు విడిచిపెట్టి బయటకి కదలదు. నాకు తెలిసిన నాటువైద్యుడు వొకాయనున్నాడు. ఆయన్నడిగి ఏదయినా మందు తెస్తాను' అంటూ వెళ్ళిపోయాడు.

తాత,సాధుబాబా అక్కడే,అలాగే మౌనంగా కూర్చుండి పోయాడు.

మరోగంట తరువాత తాత ఓ నల్లటి గిరజాల జుట్టు మనిషిని వెంటతీసుకుని వచ్చాడు. ఆయన మంచంలోని ఆమెని పరీక్షించి, నాడీవేగం గమనించి, ఆమె చరిత్రనంతా క్లుప్తంగా తాతద్వారా విని 'గుండె చాలా బలహీనంగా వుంది. ఆమెని కలవరపరిచే సంఘటన ఏదో జరిగి వుంటుది. బహుశా పూర్వస్మృతులు జ్ఞాపకానికివచ్చి తట్టుకో

లేకుండా వున్నట్లుంది. చెప్పలేం! రెండు రోజులయినా కావచ్చు. రెండు నెలలయినా కావచ్చు,' అంటూ ఏవో రెండు మాత్రలు తాత చేతికిచ్చి వెళ్ళిపోయాడు.

తాత అతిబలవంతాన ఆమెచేత ఆ మందు మింగించాడు. సాధుబాబా ఎండిపోయిన కళ్ళతో అలాగే మౌనంగా చూస్తూ కూర్చుండిపోయాడు.

మరునాటికి ఆమె కొంత తేరుకుంది. కానీ మనిషి రాను రాను క్షీణించిపోసాగింది.

సాధుబాబా మరెప్పుడూ, ఆమెకి గత సంఘటనలు జ్ఞాపకంచేసే ప్రయత్నం మరి చెయ్యలేదు. నూర్ అని పిలవటంకూడా మానేశాడు. పగలంతా భిక్షాటన తరువాత ఆమె ఎదురుగా తన నివాసం ఏర్పరచుకున్నాడు.

ఆమెని గమనిస్తూ కలలా కరిగిపోయిన జీవితాన్ని, అతిమధురంగా ఆమెతో గడిపిన సమయాన్ని, ఆ మధుర స్మృతుల్ని మననం చేసుకుంటూ గడిపేవాడు. రతన్‌సింగ్ సాధుబాబాని చూసి 'మరో పిచ్చివాడు' అంటూ నవ్వేవాడు. 'అవును రతన్, నేను ఓడిపోయాను. ఓడిపోయాను' అంటూ గొణుక్కునేవాడు సాధుబాబా.

* * *

మరో రెండు సంవత్సరాలు గతంలోకి దొర్లిపోయినాయి. క్రమక్రమంగా సాధుబాబాలో ఒకే ఒక్క కోరిక ఉధృతంగా పెరుగుతోంది. ఒక్కసారి, ఒకే ఒక్కసారి మధురాతి మధురంగా తనపేరు ఆమెనోట పలకాలి. ఎండిపోయిన తన గుండెలమీద పన్నీటి జల్లులాగా, తొలకరి వానలాగా, 'అమర్' అన్న ఆ తీయని కంఠధ్వని విని పులకించిపోవాలి!

బండబారిన హృదయం 'అమర్' అన్న ఆ మధురాతి మధురస్వరానికి, కరిగి, ప్రవహించి, పరవళ్ళు తొక్కాలి!

సాధుబాబా నిదురరాక కటిక నేలమీద దొర్లుతున్నాడు. మరింక నిద్ర పట్టదని నిశ్చయించుకుని లేచి కూర్చుని,ఆమె పరున్న ఆ కుక్కిమంచం వైపుగా చూశాడు. ప్రశాంతంగా నిదురలోనున్న ఆ ముఖాన్ని చూస్తూ అలాగే కూర్చున్నాడు. కలలోలాగా లేచి, ఆమె దగ్గరగా నడిచి, వంగి ఆ ముఖాన్ని పరిశీలనగా చూస్తూ వుండిపోయాడు. ఒకనాడు తనని బందీ చేసిన ఆ చూపులు, కవ్వించిన ఆ చిరునవ్వులు, మధురంగా తన పేరుని ఉచ్చరించిన ఆ పెదవులు, తనకోసం సర్వస్వాన్ని కాలదన్ని, తనవెంట నడిచిన నూర్-వడలిన గులాబీలా, నలిగిన మల్లెదండలా, అనుక్షణం నిరీక్షణతో, బక్కచిక్కిన శరీరంతో, ఆ కుక్కిమంచంలో ప్రశాంతంగా నిదురిస్తున్న ఆమెని చూడగానే సాధుబాబా హృదయంలో చెప్పలేని ఉద్వేగం కలిగింది. ప్రియాతి ప్రియంగా, గాఢంగా ఆమెని తన గుండెలకదుముకోవాలన్నట్టుగా జాపిన చేతులు చటుక్కున కిందకి వాలిపోయినాయి. ఆమె నిద్రలో కదిలి పక్కకి తిరిగింది.

సాధుబాబా మెల్లగా స్టేషను బయటికి నడిచాడు. పుచ్చ పువ్వులాటి వెన్నెల విరగబడి కాస్తోంది.

మరబొమ్మలాగా నడుస్తున్న సాధుబాబా పాదాలు గంగా ప్రవాహంవైపుగా దారితీశాయి. ఆ అర్ధరాత్రివేళ నీటిమీద నించి వీచే చల్లనిగాలి మరిగిపోతున్న మనసును హాయిగా, చల్లగా తాకుతోంది. నడిచి, నడిచి అలిసిపోయిన సాధుబాబా మరింక శక్తిలేనట్లుగా ఆ నది గట్టునే వాలిపోయాడు. అలసటగా కళ్ళు మూతబడినాయి.

'ఏది ఏమయినా సరే నూర్ తనని గుర్తించాలి! తను అనుక్షణం కళ్లలో దీపాలు వెలిగించుకుని ఇన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆ అదృష్టవంతుడిని నేనే నని చెప్పాలి! తను గుర్తించలేని ఆ దురదృష్టవంతుడిని, ఆ దౌర్భాగ్యుడిని నేనేనని చెప్పాలి!

'నేనే నీ అమర్‌ని' అని గొంతెత్తి అరవాలి. నన్ను చూసి భయపడకు, పారిపోకు, నీ హృదయంలో గుర్తించు నూర్ అని కుళ్ళి కుళ్ళి ఏడవాలి. నా గుండెలమీద వాలిన నూర్ తలని ముద్దులతో ముంచెత్తాలి!

నూర్ ఒక్కసారి, ఒకే ఒక్కసారి మధురాతిమధురంగా నీ పిలుపు వినిపించు. నన్ను నేనే మర్చిపోనీ, మూగపోయిన ఆ గొంతుని పలికించు, నన్ను మరిపించు నా నూర్!

నా గుండెలమీద వాలి 'అమర్' అన్న నీ మృదుమధుర స్వరాన్ని వినిపించు. నూర్! వస్తున్నాను, నీ దగ్గరగా వస్తున్నాను. నన్ను గుర్తించలేదా నూర్? నేను,నీ అమర్‌ని ఓ నా ప్రాణమా, ఓ నా ప్రియసఖీ, నా జీవిత సర్వస్వమా నా దివ్యజ్యోతీ, నా నూర్! నూర్! నేను, నీ అమర్‌ని వస్తున్నాను. ఇన్ని సంవత్సరాల ఈ వ్యధని పీడకలగా మర్చిపో. చూడు మనకోసం దివ్యలోకాలు ఎదురు చూస్తున్నాయి. నేను ఎప్పటి నీ అమర్‌నే నూర్! నా చూపులో, నా ఊపిరిలో, నా మనసులో, నా అణువణువునా నిండి వున్న నా ప్రియా, వస్తున్నాను. నీ దగ్గరగా. మనకిది పునర్జన్మ నూర్, నూర్'.

సాధుబాబా ఉలిక్కిపడి లేచాడు. చీకటిరాత్రి తొలగిపోయి వాడిగా సూర్యకిరణాలు చురుక్కుమనిపిస్తున్నాయి. ఒక్క ఉదుటున లేచి నిలబడి, ఉత్సాహంగా, సంతోషంగా ఆ నది వడ్డు వెంబడే పరుగుపెడుతున్నట్టుగా నడవసాగాడు.

* * *

అమర్ గుండెలమీద వాలిన నూర్ వెక్కి వెక్కి

# యువ

పాఠకులకు, ప్రకటనదారులకు

## దీపావళి శుభాకాంక్షలు

ఏడుస్తోంది నూర్ సంతోషం పట్టలేక. చేతులతో అతని శరీరాన్ని తడిమిచూసి, తృప్తిగా ఆ మెడలో తన చేతుల్ని వేసింది. 'అమర్! వచ్చేశావా! నిజంగా వచ్చేశావా! ఎంత కాలంగా, ఎన్ని యుగాలుగా నీ కోసం ఎదురుచూస్తున్నానో తెలుసా? ఇంతకాలం నన్ను వదిలి ఎక్కడున్నావ్ అమర్? నన్నింక వదిలి వెళ్ళవుగదూ? అమర్, నన్ను వదిలి వెళ్ళవుగదూ!'

ఆమె ఉలిక్కిపడి లేచి కళ్ళు తెరచి చుట్టూ చూసింది. మసక వెలుతురులో ఆ ప్రదేశమంతా ప్రశాంతంగా వుంది. ఆమె చెంపలమీదుగా ధారగా కన్నీరు జారిపోతోంది. పట్టలేని ఆనందంతో, సంతోషంతో శరీరం వణికిపోతోంది. మంచం మీదుగా వంగి క్రిందనున్న తుప్పుపట్టిన పాత ఇనుప పెట్టెని తెరచింది భద్రంగా. చిన్న పెన్సలు ముక్కని, నలిగిన పాత కాగితాన్ని తీసింది. అడుగునించి.

వణికే చేతులతో ఆ కాగితంమీద రాసుకుంది. 'వచ్చేశావా! నా కోసం వచ్చేశావా! ఇన్నినాళ్ళ నా నిరీక్షణ ఫలించాలి.'

అతి ప్రియంగా, ఆ కాగితాన్ని రెండుచేతులతో గుండెలకి అదుముకుని ఆనందంగా కళ్లు మూసుకుని, అలాగే మంచంలో ఒరిగిపోయింది.

* * *

పరుగుపెడుతున్నట్టుగా నడుస్తున్న సాధుబాబా వగరుస్తూ స్టేషను జేరుకున్నాడు. సంతోషంగా, ఆత్రుతగా. ఆమెవైపుగా నడవబోయిన సాధుబాబా విభ్రాంతితో కాలు కదలనట్టుగా, శిలావిగ్రహంలాగా నిలబడిపోయాడు.

ఆ మూల జాగా ఖాళీగా వుంది! ఆ ప్రదేశంలో ఆ కుక్కిమంచంగానీ, దానిమీద కూర్చుని దూరతీరాల్లోకి చూస్తూవుండే ఆమెగానీ, ఆ మంచంక్రింద తుప్పుపట్టిన చిన్న పెట్టెగానీ కనపడలేదు. ఆ చోటులో రతన్‌సింగ్ శిలావిగ్రహంలాగా కళ్ళు మూసుకుని కూర్చుని వున్నాడు. ఆమె వ్రాసిన పాత కాగితం ముక్క అతని చేతిలో నలుగుతోంది.

సాధుబాబాని చూస్తూనే తాత ఎదురొచ్చాడు కన్నీటితో. ఆప్తబంధువులని కోల్పోయినట్లు తాత మొహం అతివిచారంగా వుంది.

'సాధుబాబా, పిచ్చితల్లికి ఈ లోకంతో ఋణం తీరిపోయింది. ఇప్పుడే రైల్వేపోలీసులు గంగామాతకి అర్పించటానికి తీసుకుపోయారు' అన్నాడు కన్నీరు తుడుచుకుంటూ.

సాధుబాబా పిచ్చివాడికిమల్లే, సర్పద్రష్టునిలాగా, విద్యుద్ఘాతం తిన్నవాడిలాగా, నమ్మకం కుదరనట్టుగా ఆ ఖాళీ ప్రదేశాన్ని చూస్తున్నాడు తదేకంగా.

'తాతా ఆమెని ఎక్కడికి తీసుకువెళ్ళారో చెప్పగలవా?' అన్నాడు అతిమెల్లగా.

తాత చెప్పిన గుర్తుల ప్రకారం పరుగుపెడుతూ నదీ ప్రవాహం దగ్గరకి వచ్చాడు సాధుబాబా. అప్పటికే అంతా ముగిసిపోయింది. జాతి, కుల, మతాలతో ప్రమేయంలేని గంగా భవాని నూర్ దేహాన్ని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది.

ఆ తరువాత సాధుబాబాని మరెవ్వరూ చూడలేదు. రతన్‌సింగ్ జాడ తెలియరాలేదు!

Printed and Published by A. Sudhakara Rao, at 5-9-88, Public Garden Road, Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Hyderabad-500001.
Controlling Editor : "CHAKRAPANI"